www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 37 | | 14-7-2026 | | మంగళవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |



# గోదావరి నీటిని పూర్తిగా వాడుకుంటాం



## కుల వివక్షను దూరం చేస్తాం

- 25 ఎకరాల్లో రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం
- ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో సీఎం భేటీ
- విద్యా సంస్కరణలు వివరించిన రేవంత్ రెడ్డి
- కేంద్రం సహకారం అందించాలని సీఎం విజ్ఞప్తి

...వివరాలు 2లో

### దేవాదుల ద్వారా 7 మోటార్లతో పంపింగ్

- బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్మాణాలు నాసిరకం
- సమ్మక్క బ్యారేజీ వద్ద నీటి నిల్వ
- మేడిగడ్డలో గేట్లు మూస్తే ప్రమాదం
- నిపుణుల సూచనలు పాటిస్తున్న ప్రభుత్వం
- దేవాదుల ప్రాజెక్టుకే మా తొలి ప్రాధాన్యత
- బ్యారేజీ పనులను పరిశీలించిన మంత్రులు భట్టి, ఉత్తమ్, పొంగులేటి

2

గోదావరి జలాలను సాధ్యమైనంత మేరకు వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ ప్రాజెక్టును మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజీకి తీవ్ర ప్రమాదం ఉందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ హెచ్చరించిందని, అందుకే నిపుణుల సూచనలను కచ్చితంగా పాటిస్తున్నామని మంత్రులు స్పష్టం చేశారు. హెలికాప్టర్‌లో ప్రాజెక్టు వద్దకు చేరుకున్న మంత్రులకు స్థానిక అధికారులు ఘన స్వాగతం పలికారు. సమ్మక్క బ్యారేజీ, దేవాదుల ప్రాజెక్టు పనులను మంత్రులు నిశితంగా పరిశీలించారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిపై వారు కీలక వ్యాఖ్యలు చేశారు.

*- హైదరాబాద్, జూలై 13*

# నరహంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా పెంజర్ల పొలాల్లో మృతదేహం
- స్థానికుల సమాచారంతో రాజ్‌కుమార్ గుర్తింపు
- మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ లభ్యం
- శవం పక్కనే ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- హత్యకు ముందు వీడియో కాల్ రికార్డు చేసిన హంతకుడు



తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్‌కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్‌కుమార్‌గా నిర్ధారించారు. మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్‌ను గుర్తించారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఉన్మాదిగా మారి నరమేధం సృష్టించాడు.

*- హైదరాబాద్, జూలై 13*

3

## బాలికను నమ్మి అప్పులపాలయ్యా

- ఆత్మహత్యకు ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో
- వివరాలు వెల్లడించిన సైబరాబాద్ కమిషనర్ జోషి

3





## సుప్రీంలో తెలంగాణకు చుక్కెదురు!

- ఏపీకి నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు
- బనకచర్ల అనుసంధానంపై పిటిషన్.. సాంకేతిక లోపాలు ఉన్నాయని స్పష్టీకరణ
- లోపాలు సవరిస్తేనే విచారణ :న్యాయస్థానం

3

## సింగరేణిని దోచుకున్న పార్టీలు!

- ఓటు బ్యాంకుగా వాడుకున్న కేసీఆర్
- మన్మోహన్ పాలనలో బొగ్గు కుంభకోణం
- సింగరేణికి మోదీ సర్కార్ అండ
- సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2





## సుప్రీం సాక్షిగా వైఫల్యం!

- కావాలనే లోపాలతో పిటిషన్
- బనకచర్ల విషయంలో కపట నాటకాలు
- రాజకీయ గురువు కోసమే డ్రామాలు
- రేవంత్‌పై హరీష్ రావు ఫైర్

2

## పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత ముఖ్యం

4

- అసోంలో 27మంది వ్యక్తుల పౌరసత్వంపై విచారణ
- వారిపై బలవంతపు చర్యలు తీసుకోరాదన్న సుప్రీం





## ఐక్యరాజ్యసమితి ఛార్టర్ ఉల్లంఘనలు

ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచుతున్న అమెరికా

తాజా దాడులపై మండిపడ్డ ఇరాన్

4

## పేపర్ లీక్‌లపై రాహుల్ మండిపాటు

- విద్యా వ్యవస్థ దోపిడీ యంత్రాంగంగా మారిందని విమర్శ
- 'ఛాత్రోన్ కీ గూంజ్'లో విద్యార్థులు పాల్గొనాలని పిలుపు

4

దేశంలో వరుసగా జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతిపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. భారత విద్యా వ్యవస్థ ప్రస్తుతం నిజాయతీ లేని దోపిడీ యంత్రాంగంగా మారిందని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు.



# రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా!

- రాష్ట్ర ఎంపీలతో సీఎం రేవంత్ సమావేశం
- కేంద్రం నుంచి నిధుల సాధనపై దిశానిర్దేశం
- ప్రజాభవన్‌లో అధికారుల పవర్ పాయింట్ ప్రెజెంటేషన్
- పార్టీలకు అతీతంగా పని చేయాలని సూచన
- సమావేశంలో పాల్గొన్న పలువురు మంత్రులు, ఎంపీలు




**హైదరాబాద్, జూలై 13:** రాష్ట్ర విశాల ప్రయోజనాలే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి ముందుకు సాగుదామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో తెలంగాణకు చెందిన వివిధ పార్టీల ఎంపీలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలపై అధికారులతో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇప్పించారు. ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పనకు కేంద్రం నుంచి అనుమతులు సాధించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. దేశ జనాభాలో 10 శాతం జనాభా ఆరు మహా నగరాల్లో ఉందని, ఇందులో హైదరాబాద్ నగరం 25 శాతం జీడీపీ కలిగి ఉందని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు కోసం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిని కలిసి మంజూరుకు విజ్ఞప్తి చేయాలని ఎంపీలకు సూచించారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 1 స్వాధీనం, ఫేజ్ 2 విస్తరణకు కన్సల్టెంట్‌గా ఎస్‌బీఐ క్యాప్స్‌ను నియమించేందుకు కేంద్రం అంగీకరించిందని, ఆ ప్రక్రియ త్వరగా ముందుకు సాగేలా బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగంలో 95 శాతం భూ సేకరణ పూర్తయిందని, ఆ పనుల ప్రారంభానికి, దక్షిణ భాగం భూ సేకరణకు కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలపాల్సి ఉందన్నారు. మూసీ పునరుజ్జీవనం పనులకు కేంద్ర అప్రూవల్ లెటర్ ఇవ్వాల్సి ఉందన్నారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు 15.09 టీఎంసీల నీరు రావలసి ఉన్నా పూడికతో 5 టీఎంసీలకు మించి రావడం లేదన్నారు. డ్యామ్‌తో పాటు కాలువల్లో పూడిక తొలగింపునకు ఏపీ, కర్ణాటక సహకరించేలా ఒప్పించాలని కేంద్ర మంత్రిని కోరామని సీఎం తెలిపారు. నదుల అనుసంధానంలో ఛత్తీస్‌గఢ్‌కు గోదావరిలో 300 టీఎంసీల వాటా ఉందన్నారు. భవిష్యత్‌లో వారు 160 టీఎంసీలు వాడుకున్నా 143 టీఎంసీలు మిగులు ఉంటాయని, అందులో తెలంగాణకు 43 టీఎంసీలు లభించే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ప్రారంభించిన ప్రాజెక్టులకు ఏపీ ఎన్ఓసీలు ఇస్తే వాటికి ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని చెప్పారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సంబంధించి 150 నుంచి 151 అడుగుల్లో నిర్మించేందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రితో భేటీ అవుదామని ఎంపీలకు సూచించారు. బుల్లెట్ రైళ్లకు సంబంధించి ఎలైన్‌మెంట్లు కొలిక్కివచ్చాయని సీఎం వివరించారు. ఆదిలాబాద్, వరంగల్ డిఫెన్స్ ఎయిర్‌పోర్టులకు అవసరమైన భూసేకరణ పూర్తి చేశామని తెలిపారు. పెండింగ్ అంశాలకు సంబంధించి ఏ సమాచారం కావాలన్నా ఢిల్లీలోని కో ఆర్డినేషన్ అధికారి, ఐఏఎస్ అద్వైత్ కుమార్ సింగ్ నుంచి తీసుకోవచ్చని ఎంపీలకు సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, పలువురు ఎంపీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# సుప్రీం సాక్షిగా వైఫల్యం!

**కావాలనే లోపాలతో పిటిషన్ .. బనకచర్ల విషయంలో నాటకాలు**

**రాజకీయ గురువు కోసమే డ్రామాలు.. రేవంత్‌పై హరీష్ రావు ఫైర్**

**సంగారెడ్డి, జూలై 13:** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు సుప్రీంకోర్టు సాక్షిగా మరోసారి బయటపడ్డాయని మాజీ మంత్రి హరీష్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కావాలనే లోపాలతో కూడిన పిటిషన్‌ను వేయడం వల్లే అది నిలవదని ఉన్నత న్యాయమూర్తులు మొట్టికాయలు వేశారని ఆయన గుర్తు చేశారు. బానకచర్ల విషయంలో తన రాజకీయ గురువు చంద్రబాబు కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కపట నాటకాలు, డ్రామాలు ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. బానకచర్ల విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని మొదటి నుంచి బీఆర్ఎస్ నెత్తీనోరు బాదుకుంటూనే ఉందని హరీష్ రావు తెలిపారు. చంద్రబాబుతో రేవంత్ కుమ్మక్కయ్యారని చెప్పడానికి ఇంతకంటే ఇంకేం ఆధారాలు కావాలని ఆయన ప్రశ్నించారు. “నువ్వు కొట్టినట్లు చేయి.. నేను ఏడ్చినట్లు చేస్తా“ అన్నట్లుగా రేవంత్ డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ కేవలం ఉద్యమ ద్రోహే కాదు, తెలంగాణకు జలద్రోహిగా కూడా మారిపోయారని ఆయన ఫైర్ అయ్యారు. బానకచర్ల సమావేశానికి వెళ్లనని చెప్పిన రేవంత్.. ఆ తర్వాత దొంగచాటుగా వెళ్లారని హరీష్ రావు ఆరోపించారు. పైగా చంద్రబాబుకు అత్యంత నమ్మకస్తుడైన, తెలంగాణ ద్రోహి అయిన ఆదిత్యనాథ్ దాస్‌ను కమిటీలో ఎలా నియమిస్తారని ఆయన నిలదీశారు. రేవంత్ రెడ్డికి జల వనరులపై అవగాహన తక్కువ, ఆవేశం ఎక్కువని ఎద్దేవా చేశారు. బానకచర్లపై గతేడాది కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన రిట్ పిటిషన్ డిస్మిస్ అయిన తర్వాత గత 7 నెలలుగా ఈ ప్రభుత్వం ఏం చేస్తూ తమాషాలు చూస్తోందని ఆయన ప్రశ్నించారు. ఎన్ఓసీ పేరిట తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ ఏపీకి అమ్మేసుకుంటున్నారని, దీనిపై అసెంబ్లీని సమావేశపరిచి తక్షణం చర్చ జరపాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. దొంగచాటుగా వ్యవహారాలు నడిపితే తాము ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బానకచర్ల విషయంలో రేవంత్ తీరు అనుమానాస్పదంగా ఉందనే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేదని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ నిర్మించిన ప్రాజెక్టులను వాడుకోవడం కూడా కాంగ్రెస్ నేతలకు చేతకావడం లేదని మండిపడ్డారు.

# కుల వివక్షను దూరం చేస్తాం

- 25 ఎకరాల్లో రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం
- ఎస్సీ కమిషన్ చైర్మన్‌తో సీఎం భేటీ
- విద్యా సంస్కరణలు వివరించిన రేవంత్ రెడ్డి
- కేంద్రం సహకారం అందించాలని సీఎం విజ్ఞప్తి



**హైదరాబాద్, జూలై 13:** రేవంత్‌తో జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిశోర్ మక్వానా భేటీ అయ్యారు. మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో జరిగిన ఈ సమావేశంలో సీఎం విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను బృందానికి వివరించారు. ప్రధానంగా విద్యార్థుల మధ్య కుల వివక్షను దూరం చేసేందుకు రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎస్సీల అభివృద్ధికి కేంద్రం కూడా సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి వీటిని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నర్సరీ నుంచి 12 వ తరగతి వరకు మెరుగైన విద్యను అందించాలన్న లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. బ్రేక్‌ఫాస్ట్, లంచ్ బడిలోనే అందిస్తూ, విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ముందుగా కోర్ అర్బన్ ప్రాంతాల్లో వీటిని ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రంలో ఎస్సీలకు వారి జనాభా శాతం కంటే ఎక్కువ అవకాశాలు కల్పిస్తున్నామని సీఎం వివరించారు. రాజకీయాలతో పాటు ఇతర రంగాల్లో వారికి అత్యంత కీలక స్థానాలు ఇచ్చామని గుర్తు చేశారు. ఎస్సీ ఉప కులాల వర్గీకరణ కూడా పూర్తి చేసి రాష్ట్రంలో పక్కాగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రి అడ్లూరి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, సీఎస్ సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జాడలేని వర్షాలు.. ముఖం చాటేసిన మబ్బులు

**మళ్లీ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు**

**హైదరాబాద్, జూలై13:** తెలంగాణలో జులై నెలలోనూ ఎండలు తీవ్రత మళ్లీ మెల్లగా పెరుగుతోంది. వర్షాలు ముఖం చాటేయంతో ఎండలు కొనసాగుతున్నాయి. సాధారణంగా ఈ కాలంలో వర్షాలు కురవాల్సి ఉండగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగాయి. జులై రెండో వారంలోనూ సాధారణం కంటే సుమారు 3.5 డిగ్రీల సెల్సియస్ అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వాతావరణ పరిస్థితుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగటి వేళల్లో ఎండ తీవ్రత పెరిగి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, వచ్చే రెండు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, అనారోగ్య సమస్యలున్న వారు అవసరమైతే తప్ప మధ్యాహ్నం సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం మంచిదని సూచిస్తున్నారు. అలాగే తగినంత నీరు తాగడం, తేలికపాటి దుస్తులు ధరించడం, ఎండలో ఎక్కువసేపు తిరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

# గోదావరి నీటిని పూర్తిగా వాడుకుంటాం

- దేవాదుల ద్వారా 7 మోటార్లతో పంపింగ్
- బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్మాణాలు నాసిరకం
- సమ్మక్క బ్యారేజీ వద్ద నీటి నిల్వ
- మేడిగడ్డలో గేట్లు మూస్తే ప్రమాదం
- నిపుణుల సూచనలు పాటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- దేవాదుల ప్రాజెక్టుకే మా తొలి ప్రాధాన్యత
- బ్యారేజీ పనులను పరిశీలించిన మంత్రులు భట్టి, ఉత్తమ్, పొంగులేటి



**ములుగు, జూలై 13:** గోదావరి జలాలను సాధ్యమైనంత మేరకు వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్క సాగర్ ప్రాజెక్టును మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన సందర్శించారు. మేడిగడ్డ వద్ద గేట్లు మూసివేస్తే బ్యారేజీకి తీవ్ర ప్రమాదం ఉందని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ హెచ్చరించిందని, అందుకే నిపుణుల సూచనలను కచ్చితంగా పాటిస్తున్నామని మంత్రులు స్పష్టం చేశారు. హెలికాప్టర్‌లో ప్రాజెక్టు వద్దకు చేరుకున్న మంత్రులకు స్థానిక అధికారులు ఘన స్వాగతం పలికారు. సమ్మక్క బ్యారేజీ, దేవాదుల ప్రాజెక్టు పనులను మంత్రులు నిశితంగా పరిశీలించారు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితిపై వారు కీలక వ్యాఖ్యలు చేశారు. కన్నెపల్లి పంప్ హౌస్ ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించే వారు వాస్తవాలు తెలుసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. పారే నీటినే ఎత్తుకునే అవకాశం ఉంటే కేసీఆర్ ప్రభుత్వం 3 బ్యారేజీలు ఎందుకు కట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 22 రిజర్వాయర్ల కోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. గతంలో నిర్మించిన డ్యామ్‌లు ఎంతో భద్రంగా ఉంటే, బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన బ్యారేజీలు మాత్రం నాణ్యత సమస్యలతో నిలిచిపోయాయని ఆయన ఆరోపించారు. సమ్మక్క బ్యారేజీలో నీటిని నిల్వ చేస్తే పంపింగ్ ఎంతో సులభం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకే తమ ప్రభుత్వం వ్యవహరిస్తోందని తెలిపారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల్లో నాణ్యత లోపాలు ఉన్నాయని నిపుణుల కమిటీ ఇప్పటికే నివేదించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డిజైన్ లోపాలు, నాణ్యతలేమి కారణంగానే ప్రస్తుతం ఈ దుస్థితి వచ్చిందని ఆయన ఆరోపించారు. మేడిగడ్డపై ఐఐటీ బాంబే నిపుణులతో పాటు సైన్యం సహకారంతో సాంకేతిక పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. దేవాదుల ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పనులు పూర్తి చేస్తున్నామని, ప్రస్తుతం 7 పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం నీటిని వాడకుండానే గత ఏడాది 84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించామని గుర్తు చేశారు.

# కేసీఆర్ దిగజారుడు రాజకీయాలు

**ఎన్టీఆర్ ప్రాపకం కోసమే కొడుక్కు తారకరామారావు పేరు**

**భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపాటు**



**హైదరాబాద్, జూలై 13:** కేసీఆర్ రాజకీయ జీవితమంతా పాప పంకిలమేనని, అవసరానికి తగ్గట్లుగా ఊసరవెల్లి తీరులో నడిచిన ఘనుడని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టికెట్ కోసం కొడుకు పేరు మార్చిన ఘనత కేసీఆర్ ది అంటూ వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్‌ను కాకా పట్టేందుకు కొడుకు పేరును తారకా రామారావు అని పెట్టుకున్నాడని అన్నారు. మంత్రి పదవి రాలేదనే కేసీఆర్ టీడీపీ నుంచి బయటకు వచ్చారన్నారు. చంద్రబాబు కూడా మంత్రి పదవి ఇవ్వకుండా పక్కన పెట్టారని అన్నారుపార్టీ పెట్టి ఎలక్షన్లు, కలెక్షన్లు చేసిన వ్యక్తి కేసీఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రక్తదాహం, ధనదాహం, అధికార దాహం ఉందని విమర్శించారు. అందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఇంటికి పరిమితం చేశారన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని ఎంపీ తెలిపారు. తెచ్చింది కాంగ్రెస్ నేతలన్నారు. విద్యార్థులను రెచ్చగొట్టి బలిదానాలకు బీఆర్ఎస్ కారణమైందని అంటూ ఆరోపించారు. పిట్ట కథలు చెప్పి కేసీఆర్ అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. కమీషన్లు దండుకోవడం తప్ప ఎకరానికి కూడా కేసీఆర్ నీళ్లు ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. 'పార్టీ పేరు మార్చుకున్న చరిత్ర మీకే దక్కింది' అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సెటైర్ విసిరారు. 2009లో కేటీఆర్ తెలంగాణ ఉద్యమంలోకి వచ్చినట్లు తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులను కేసీఆర్ ఏనాడూ పట్టించుకోలేదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలూ ఒక్కటే అని.. ఈటల రాజేందర్‌ను ఎంపీగా గెలిపించింది బీఆర్ఎస్ అంటూ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు గుప్పించారు. అందుకే బిజెపి ఎంపి ఇప్పుడు మళ్లీ బిఆర్ఎస్ గొంతుతో మాట్లాడుతున్నారని అన్నారు. కాళేశ్వరం పేరుతో నిధులు దండుకున్న వీరు మళ్లీ దానిగురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు.



# తెలంగాణకు సుప్రీంలో చుక్కెదురు!

**ఏపీకి నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించిన సుప్రీంకోర్టు**

**బనకచర్ల అనుసంధానంపై పిటిషన్ దాఖలు**

**అభ్యర్థనను తోసిపుచ్చిన జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం**

**తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని స్పష్టీకరణ**

**లోపాలు సవరిస్తేనే విచారణ చేపడతామని తేల్చిచెప్పిన న్యాయస్థానం**

**న్యూఢిల్లీ, జూలై13:** బానకచర్ల అనుసంధానం, గోదావరి నీటి వినియోగం, పోలవరం అంశాలపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు ఇవ్వాలన్న తెలంగాణ సర్కార్ విజ్ఞప్తిని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. పిటిషన్‌లో తీవ్ర సాంకేతిక లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దే వరకు విచారణ చేపట్టడం ఏమాత్రం కుదరదని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. బానకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడంతో పాటు ఇంజక్షన్ ఉత్తర్వులు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోర్టును కోరింది. అయితే జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ సందర్భంగా ఈ పిటిషన్ నిబంధనలకు విరుద్ధంగా లిస్ట్ అయిందంటూ తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసింది. రిజిస్ట్రీ రూల్స్ ప్రకారం ఇలాంటి ఒరిజినల్ సూట్ పిటిషన్‌ను ముందుగా ఛాంబర్ జడ్జి ముందుకు దాఖలు చేయాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఆ ప్రక్రియ పూర్తికాకముందే నేరుగా బెంచ్ ముందుకు విచారణకు రావడంపై సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. ప్రధాన పిటిషన్‌లో పలు లోపాలు ఉన్నాయని, వాటిని సవరించే వరకు విచారణ చేపట్టడం కుదరదని స్పష్టం చేసింది. ఈ కేసులో 15 మంది ప్రతివాదులు ఉన్నారని తెలంగాణ ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. పిటిషన్‌లో ఉన్న లోపాలను ముందుగా సరిదిద్దాలని, ఆ తర్వాతే విచారణలో మిగతా అంశాలను నిశితంగా పరిశీలిస్తామని కోర్టు పేర్కొంది. అప్పటి వరకు ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన వాదనను సుప్రీంకోర్టు ఏమాత్రం పట్టించుకోలేదు. పిటిషన్‌పై ఎలాంటి విచారణ జరపకుండా నోటీసులు ఎలా ఇస్తామని ప్రశ్నించింది. ఒరిజినల్ సూట్ విషయంలో నిబంధనల ప్రకారమే విచారణకు రావాలని కోర్టు స్పష్టం చేసింది.

# సర్పంచ్ కుటుంబానికి కేటీఆర్ పరామర్శ

**రాజన్న సిరిసిల్ల, జూలై13:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి సర్పంచ్ మాశెట్టి లచ్చయ్య కుటుంబాన్ని పరామర్శించారు. లచ్చయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. లచ్చయ్య అకాల మరణం బాధాకరమని కేటీఆర్ అన్నారు. ఆయన మృతి తీరని లోటు అని పేర్కొన్నారు. లచ్చయ్య కుటుంబసభ్యులకు అండగా ఉ ంటామని భరోసా కల్పించారు. కాగా, కేటీఆర్ వెంట న్యాఫ్స్ కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పార్టీ మండల అధ్యక్షుడు బొంపెల్లి సురేందర్ రావు , పార్టీ, గ్రామ నేతలు ఉన్నారు

# ఉరేసుకుని మహిళా సర్పంచ్ ఆత్మహత్య

**నిర్మల్, జూలై13:** నిర్మల్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. తానూరు మండలం బోరిగావ్ గ్రామ సర్పంచ్ పల్లె జ్యోతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సర్పంచ్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. కాగా, సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులా? కుటుంబ కలహాలా? మరేదైనా కారణం ఉ ందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

# కాగజ్‌నగర్ లైంగికదాడి బాధితురాలికి అండగా ఉంటాం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** కాగజ్‌నగర్‌లో బాలికపై జరిగిన అఘాత్యాన్ని సాహెర బాను తీవ్రంగా ఖండించారు. మృగాడి అకృత్యానికి బలైన బాధితురాలికి అండగా నిలుస్తామని చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు ఏ మాత్రం తాత్సారం చేయకుండా నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దారుణానికి కప్పి పుచ్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, ఈ విషయం బయటకు వస్తే



కుటుంబంతో పాటు ఊరి పరువు పోతుందని బాధిత కుటుంబానికి బెదిరించినట్టు తెలిసిందన్నారు. చావు, బతుకుల మధ్య ఉన్న బాలికకు జిల్లా ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు. ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా పోలీస్ యంత్రాంగం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నరహంతకుడు రాజ్‌కుమార్ ఆత్మహత్య

- రంగారెడ్డి జిల్లా పెంజర్ల పొలాల్లో మృతదేహం
- స్థానికుల సమాచారంతో రాజ్‌కుమార్ గుర్తింపు
- మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ లభ్యం
- శవం పక్కనే ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు
- హత్యకు ముందు వీడియో కాల్ రికార్డు చేసిన హంతకుడు



**రంగారెడ్డి, జూలై13:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్‌కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజర్లలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్‌కుమార్‌గా నిర్ధారించారు. మృతదేహం పక్కన పాయి-ంజన్ బాటిల్‌ను గుర్తించారు. నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు. ఓ బాలికను వేధించిన వ్యవహారంలో తనపై పోక్సో కేసు పెట్టారనే కక్షతో రాజ్‌కుమార్ శుక్రవారం అర్ధరాత్రి ఉన్మాదిగా మారి నరమేధం సృష్టించాడు. తొలుత బాలిక తల్లి, నానమ్మలను కత్తిపోట్లతో కడతేర్చాడు. తర్వాత నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బాలికను గొంతుకోసి చంపేశాడు. అనంతరం ఇంటికెళ్లి భార్య, నిద్రిస్తున్న కన్న బిడ్డల గొంతుకోసి కర్కశంగా హతమార్చాడు. మొత్తం అరగంట వ్యవధిలో మూడు ప్రాంతాల్లో ముగ్గురు మహిళలు, ఓ బాలిక, ఇద్దరు ముక్కుపచ్చలారని చిన్నారుల్ని కిరాతకంగా అంతమొందించాడు. పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు 14 ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. హైదరాబాద్-బెంగళూరు హైవేల్లోని హోటళ్లు, లాడ్జీలు, దాబాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించారు. నిందితుడి కుటుంబసభ్యులు, సన్నిహితులను ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం పెంజర్లలో రాజ్‌కుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతికి ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. మృతదేహం పక్కన ఉన్న అతడి మొబైల్ ఫోన్‌లో ఈ వీడియోను గుర్తించినట్లు ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషి తెలిపారు. రాజ్‌కుమార్‌కు బెట్టింగ్ అలవాటు ఉందని.. దీనికోసం 16 సిమ్‌లు వినియోగించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్ కారణంగా అప్పుల బాధతో జీవితంపై విరక్తి కలిగిందని.. ఓ అమ్మాయిని నమ్మి చాలా మోసపోయానని సెల్ఫీ వీడియోలో రాజ్‌కుమార్ పేర్కొన్నాడు. 2.26 సెకన్ల నిడివి గల ఈ వీడియోను మీడియా ప్రతినిధులకు సీపీ చూపించారు. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు వీడియో రికార్డు చేసినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో బాలిక సహా ఆరుగురిని అత్యంత దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ కేసు హంతకుడు రాజ్‌కుమార్ మృతదేహం అతని మేనమామ ఊరు కొత్తూరు మండలం పంజర్లలో లభ్యమైనట్లు చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ వెల్లడించారు. డీసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు సమీపంలోని ఓ వెంచర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ మృతదేహం రాజ్‌కుమార్‌దేనని డీసీపీ ధ్రువీకరించారు. రాజ్‌కుమార్ పాయిజన్ సేవించి ఆత్మహత్య చేసుకున్నాడని డీసీపీ పేర్కొన్నారు. ఘటనాస్థలిలో పాయిజన్ బాటిల్ లభ్యమైందని తెలిపారు. ఆ ఆధారాలను సేకరించిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నారు. కాగా, షాబాద్‌లో జరిగిన ఆరుగురి హత్యల ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడి కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టగా, ఈరోజు అతడి మృతదేహం లభ్యమైంది.

### వెలుగులోకి కీలక విషయాలు

సంచలనం సృష్టించిన ఆరు హత్యల కేసులో ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్‌కు సంబంధించిన పలు కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. జూన్ 12న పోక్సో కేసులో కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో అతడు కోర్టులో చేసిన వాదనలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. బెయిల్ విచారణ సందర్భంగా.. తనపై నమోదైన పోక్సో కేసు తప్పుడు కేసు అని రాజ్‌కుమార్ కోర్టుకు తెలిపినట్లు సమాచారం. బాధిత బాలిక తండ్రి తన వద్ద అప్పు చేశాడని, ఆ డబ్బులు తిరిగి అడిగినందుకే తనపై కేసు పెట్టారని వాదించాడు. ఫిర్యాదు చేసిన రోజు తాను అక్కడే లేనని, ఆ సమయంలో భార్యతో కలిసి ఆస్పత్రికి వెళ్లినట్లు కోర్టులో తెలిపాడు. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం.. మైనర్ బాలికకు సంబంధించిన కేసు నమోదైన తర్వాత రాజ్‌కుమార్ కుటుంబంలో విభేదాలు మరింత పెరిగాయి. ఈ వ్యవహారం తర్వాత అతడి భార్య సరిత విడాకులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఇదే విషయంపై రాజ్‌కుమార్ తీవ్ర ఆగ్రహానికి గురై, పలుమార్లు సరితను చంపేస్తానని బెదిరించినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలుస్తోంది. పోలీసుల దర్యాప్తు ప్రకారం.. హత్యలకు ముందు రాజ్‌కుమార్ సాధారణంగానే వ్యవహరించినట్లు గుర్తించారు. ఘటనకు కొన్ని గంటల ముందు తన కుమారుడితో కలిసి బయటకు వెళ్లి ఆడించడంతో పాటు హెయిర్ కటింగ్ కూడా చేయించినట్లు సమాచారం. అదే రోజు ఉత్సాహంగా ఇంటికి వెళ్లిన తర్వాత కుటుంబ సభ్యులపై దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

# బాలికను నమ్మి అప్పులపాలయ్యా

- ఆత్మహత్యకు ముందు రాజ్‌కుమార్ సెల్ఫీ వీడియో
- నా పిల్లలకు భూమి లేకుండా చేశానని కన్నీటి పర్యంతం
- జీవితం మీద విరక్తి చెందానని వెల్లడించిన కిరాతకుడు
- వివరాలు వెల్లడించిన సైబరాబాద్ కమిషనర్ జోషి



**షాబాద్, జూలై13:** షాబాద్‌లో వరుసగా 6 గురిని హత్య చేసిన రాజ్‌కుమార్.. ఆ తర్వాత ఆత్మహత్య చేసుకోవడానికి ఒకరోజు ముందే సెల్ఫీ వీడియో రికార్డ్ చేసినట్లు సైబరాబాద్ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. ఆ బాలికను నమ్మి పూర్తిగా అప్పులపాలయ్యానని, నా పిల్లలకు కనీసం సెంటు భూమి కూడా లేకుండా చేశానని ఆ వీడియోలో రాజ్‌కుమార్ కన్నీటిపర్యంతమయ్యాడు. ఆమె వల్ల నా జీవితం నాశనమైందని, తనను జైలుకు పంపాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ వీడియో రికార్డ్ చేశాడు. రాజ్‌కుమార్ మృతదేహం దొరికిన చోటే లభ్యమైన ఫోన్‌లో ఈ వీడియోను పోలీసులు గుర్తించారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు బానిసైన రాజ్‌కుమార్ ఏకంగా 2 కోట్లకు పైగా అప్పులు చేశాడు. ఈ అప్పుల కారణంగా అతడి మానసిక పరిస్థితి స్థిమితంగా లేదని సీపీ తరుణ్ జోషి తెలిపారు. అతడు ఏకంగా 16 సిమ్ కార్డులు వాడినట్లు గుర్తించామన్నారు. కాలేజీకి వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ఆ బాలికను రాజ్‌కుమార్ తీవ్రంగా వేధించేవాడని, అతడిపై గతంలోనే పోక్సో కేసు కూడా నమోదైందని ఆయన గుర్తు చేశారు. ఈ కేసులో రాజ్‌కుమార్ ముందస్తు బెయిల్ కూడా తెచ్చుకున్నాడని వెల్లడించారు. జులై 10 నే ఈ సెల్ఫీ వీడియోను అతడు రికార్డ్ చేసినట్లు గుర్తించామన్నారు. రాజ్‌కుమార్ 2 వేలకు ఓ కారును అద్దెకు తీసుకుని ఒకే రోజు 6 హత్యలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి 11 నుంచి 12 గంటల మధ్యలో ఈ హత్యలు జరిగాయని సీపీ చెప్పారు. ముందుగా షాబాద్‌లో బాలిక నానమ్మను చంపి, ఆ తర్వాత ఆ బాలికను తీసుకుని దైవాలగూడ వెళ్లాడని చెప్పారు. అక్కడే బాలికతో పాటు తన భార్యను, ఇద్దరు పిల్లలను కిరాతకంగా చంపేశాడని వివరించారు. హత్యల అనంతరం రాత్రి 11:37 గంటలకు తన తండ్రికి ఫోన్ చేసిన రాజ్‌కుమార్.. 6 గురిని చంపేశానని, తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పినట్లు సీపీ తరుణ్ జోషి వెల్లడించారు. ఆ తర్వాత రాత్రి ఒంటి గంటకు హంతకుడి తండ్రి పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. కాల్ డేటా ఆధారంగా హంతకుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయని చెప్పారు. క్లూస్ టీమ్ సభ్యులు అతడి మృతదేహం లభ్యమైన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారని, అయితే రాజ్‌కుమార్ ఏ సమయంలో చనిపోయాడనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని సీపీ తెలిపారు.

# సింగరేణిని దోచుకున్న పార్టీలు

- ఓటు బ్యాంకుగా వాడుకున్న కేసీఆర్
- మన్మోహన్ పాలనలో బొగ్గు కుంభకోణం
- సింగరేణికి మోదీ సర్కార్ అండ
- సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర మంత్రి



**హైదరాబాద్, జూలై13:** సింగరేణి సంస్థను గతంలో కాంగ్రెస్, పదేళ్ల పాటు బీఆర్ఎస్ పార్టీలు తీవ్రంగా దోచుకున్నాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎలాంటి వేలం లేకుండానే సింగరేణికి తాడిచర్ల 2 బొగ్గు బ్లాక్‌ను కేటాయించిందని ఆయన స్పష్టం చేశారు. కొత్తగూడెంలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సింగరేణి భరోసా యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల తీరును తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. గతంలో అధికారంలో ఉన్న మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో దేశంలోనే అతిపెద్ద బొగ్గు కుంభకోణం జరిగిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ఆ సమయంలో కేటాయించిన బొగ్గు గనులను సుప్రీంకోర్టు రద్దు చేసిందని, ఆ తర్వాతే వేలం ప్రక్రియ పారదర్శకంగా జరగాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించిందని ఆయన గుర్తు చేశారు. అయితే సింగరేణికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రధాని మోదీ వేలం లేకుండానే తాడిచర్ల 2 బ్లాక్‌ను కేటాయించారని తెలిపారు. ఇందులో గ్రేడ్ 8 నాణ్యమైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, రాబోయే 40 నుంచి 50 ఏళ్ల వరకు సింగరేణి అవసరాలు తీరుతాయని ఆయన వెల్లడించారు. గత పదేళ్ల పాటు సింగరేణిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని కిషన్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అహంకారపూరిత నిర్ణయాలతోనే సంస్థ పరిస్థితి పూర్తిగా దిగజారిందని ఆరోపించారు. సింగరేణి నుంచి తీసుకున్న బొగ్గు, విద్యుత్ బకాయిలు చెల్లించకుండా సంస్థను సుమారు 24 వేల కోట్ల అప్పుల్లోకి నెట్టేశారని మండిపడ్డారు. రాష్ట్రానికి 49 శాతం వాటా ఉన్నప్పటికీ సంస్థ అభివృద్ధి కోసం ఈ రెండు పార్టీలు ఎన్నడూ కేంద్రాన్ని సంప్రదించలేదని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే సింగరేణిని వాడుకున్నాయని దుయ్యబట్టారు. నైనీ బొగ్గు బ్లాక్ వ్యవహారంలో ఒడిశా రాష్ట్రంలో కేసీఆర్ ఎందుకు మాట్లాడలేదని ఆయన ప్రశ్నించారు. సింగరేణికి సంబంధించిన అంశాల్లో కేంద్రం ఎప్పుడూ తలదూర్చదని స్పష్టం చేశారు. సంస్థలో బొగ్గు మాయమైందని కేటీఆర్, హరీష్ రావు లేఖలు రాయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మెస్సీతో ఫుట్‌బాల్ ఆడటానికి సింగరేణి డబ్బులు ఖర్చు చేస్తారా అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సింగరేణి సంస్థను అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేయడం మానుకోవాలని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
మంగళవారం
14 జూలై 2026

# గ్రామాల అభివృద్ధి పట్టని పాలకులు!



పల్లె కన్నీరు పెడుతోంది. మంచినీటి కోసం కన్నీరు పెడుతోంది. సాగునీటి కోసం రైతన్న కన్నీరు పెడుతున్నాడు. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరించామన్న పెద్దమనుషులు గ్రామాలకు వస్తే.. చెరువులు ఎలా ఉన్నయో కనిపిస్తాయి. మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం అంతా బోగస్. ఎక్కడా చెరువుల పునరుద్ధరణ జరగలేదు. జరిగితే ఇవాళ చెరువుల్లో నీటి చుక్కకూడా లేకుండా పోదు. వర్షాలు వెనక్కి పోవడంతో గ్రామాల్లో మంచినీటి సమస్యల తరుముకు వస్తోంది. పట్టణాల్లో ఇప్పుడిప్పుడే మళ్లీ ట్యాంకర్లు తిరుగుతున్నాయి. దీర్ఘకాలిక ప్రణాళికలు లేకపోవడం వల్ల భూగకభ జలాలు వట్టి పోయాయి. తాత్కాలిక చర్యలతో ప్రభుత్వాలు ఏళ్లుగా కాలయాపన చేస్తూ వచ్చాయి. ఈ క్రమంలో ఏళ్లుగా గ్రామాలు కునారిల్లుతున్నాయి. కనీస వసతులు లేవు.

గ్రామాల అభివృద్ధి విషయంలో పార్టీలకు అతీతంగా అభివృద్ధికి అంతా కలసి రావాలి. గ్రామాలను బలోపేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. అమరావతి పేరుతో ఎపిలో గ్రామాలను పట్టించు కోవడం లేదు. బలవంతంగా రైతుల నుంచి భూములు లాక్కుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. పంటలు వేసుకున్న పొలాలను జెసిబిలతో దున్నుతూ రైతులను వీధుల్లో పడేస్తున్నారు. వారికి గౌరవప్రదమైన పరిహారం కూడా చెల్లించడం లేదు. చంద్రబాబు నిరంకుశ విధానాలకు ఇది పరాకాష్టగా నిలుస్తోంది. తెలంగాణో ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుద్ధరణ వంటి వాటికి ఇస్తున్న ప్రాధాన్యం గ్రామాలకు దక్కడం లేదు. దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ప్లాస్టిక్ భూతంలా వెన్నాడుతోంది. పర్యావరణం దెబ్బతింటోంది. మొక్కలు నాటడం లేదు. కోతులను తరమడం లేదు. భూగర్భ జలాలను పెంచే ప్రయత్నాలు సాగడం లేదు. ఈ సమస్యలన్నీ పరిష్కరించలేని వేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. ప్రజల భాగస్వామ్యంతోనే ఇవన్నీ సాధ్యం. అలాగే ప్రజలను బాధ్యులుగా కూడా చేయాలి. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి.

సర్పంచ్‌లను అందుకు బాధ్యులను చేయాలి. అనవసర పథకాలకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను పురోగించేలా చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపతేం చేస్తూ పోవాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యవసాయాధిరత చిన్న పరిశ్రమలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగాణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. ఎందుకంటే రోడ్డురవాణాను విస్తరిస్తే గ్రామాలు వాటంతట అవే పురోగమిస్తాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే హైదరాబాద్‌పై ఒత్తిడి తగ్గుతంది. పదిశాతం దృష్టి గ్రామాలపై పెట్టినా అవి అల్లుకు పోతాయి. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో య-ువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పటు గ్రామాలు పురోగమిస్తాయి. చైనా, జపాన్, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోటీపడటం... తప్పు లేదు. అందుకు తగ్గట్లుగా గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయగలిగితేనే ఇది సాధ్యం అవుతుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయ రంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి.

గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని స్థానిక వనరులను ఉపయోగించుకుంటే అభివృద్ధికి దోహదపడగలదు.చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఓవైపు రాష్ట్రమంతటా ఎల్ నినో ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. అప్పుడప్పుడు మబ్బులే తప్ప వానలు పడటం లేదు. ఒక్కోరోజు వాతావరణం ఎండాకాలాన్ని తలపి స్తున్నది. పంటలు సాగు చేసేందుకు రైతులు వెనుకాడుతున్న పరిస్థితి కనపడుతోంది. గతేడాది కంటే ప్రస్తుతం రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గనుంది. దేశంలో పంటల సాగుపై ఎల్ నినో తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్నది. ఎల్ నినో తీవ్ర రూపం దాల్చడంతో వానలు కరువయ్యాయి. మబ్బులే తప్ప చినుకు జాడలేదు. ఇప్పటివరకు రాష్ట్రంలో 21శాతం లోటు వర్షపాతం నమోదైంది. జూన్‌లో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షాలుపడలేదు. జూలై సగం నెల గడుస్తున్నా వానలు ముఖం చాటేసాయి. ఈ నెలలోనూ వర్షాలు కురువకపోవచ్చనే అంచనాలను వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలు వేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఒకవేళ ముందుగానే పంటలు వేస్తే తర్వాత వర్షాలు కురువకపోతే పెట్టుబడి నష్టపోయే ప్రమాదం ఉంటుందని రైతులు భయపడుతున్నారు. దీంతో పంటలు సాగు చేసేందుకు వేచి చూసే ధోరణిలో ఉన్నారు. ఇదంతా కూడా గ్రామాల్లో వాననీటిని ఒడిసి పట్టకపోవడం వల్ల జరిగిన నష్టంగా గుర్తించాలి. ఇప్పటికైనా గ్రామాల్లో తాగు, సాగునీటి ప్రాజెక్టును పునరుద్ధరించడం ద్వారా అభివృద్ధికి అడుగులు వేయాలి.

# ఐక్యరాజ్యసమితి చార్టర్ ఉల్లంఘనలు

**ప్రాంతీయ ఉద్రిక్తతలను పెంచుతున్న అమెరికా**
**తాజా దాడులపై మండిపడ్డ ఇరాన్**



**టెహ్రాన్, జూలై 13 :** పశ్చిమాసియాలో యుద్ధం ఆగినట్టే కనిపించినా.. ఇటీవల మళ్లీ ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. ఇరాన్, అమెరికా పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే హర్మూజ్‌లో ప్రయాణిస్తోన్న నౌకలపై ఐఆర్‌జీసీ దాడులు చేయడం తాజా ఉద్రిక్తతలకు మరింత ఆజ్యంపోసింది. అమెరికా జరిపిన తాజా సైనిక దాడులపై ఇరాన్ తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ దాడులను ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను స్పష్టంగా ఉల్లంఘించడమేనని అభివర్ణించిన ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ, వాషింగ్టన్ చర్యలు ప్రాంతీయ స్థిరత్వాన్ని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని దెబ్బతీస్తు న్నాయని ఆరోపించింది. ఇది ముమ్మాటికీ ప్రాంతీయ ఉద్రిక్తతలను మరింత పెంచడమేనని ఆరోపించింది. ఈ మేరకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేస్తూ, అమెరికాకు సహకరించే దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అమెరికా తమపై దాడులు చేయడానికి ఏ దేశమైనా తన భూభాగాన్ని లేదా సదుపాయాలను ఉపయోగించుకోవడానికి అనుమతిస్తే, ఆ దేశాలను కూడా తాము శత్రువులుగానే పరిగణిస్తామని ఇరాన్ స్పష్టం చేసింది. 'ఇరాన్‌పై సైనిక దాడులు చేయడానికి ఏ దేశ భూభాగం లేదా సదుపాయాలు ఉపయోగించినా, దానిని దురాక్రమణకు మూలంగా పరిగణిస్తాం. ఇరాన్ సాయుధ దళాల రక్షణాత్మక చర్యల్లో భాగంగా వాటిని చట్టబద్ధమైన లక్ష్యాలుగా చూస్తాం'. అని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ఇటీవల మస్కట్‌లో జరిగిన చర్చల ఫలితాలపై అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలను ఇరాన్ పూర్తిగా తోసిపుచ్చింది. వాటిని 'పచ్చి అబద్ధం' గా తేల్చింది. మస్కట్ చర్చలు కేవలం హోర్ముజ్ జలసంధి నిర్వహణ, అంతర్జాతీయ షిప్పింగ్ మార్గాల భద్రతకు సంబంధించిన ఏర్పాట్లపైనే జరిగాయని, అమెరికా అధ్యక్షుడు చిత్రీకరిస్తున్నట్లుగా కాదని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా జరిపిన సైనిక చర్యలపై ఐక్యరాజ్యసమితి సెక్రటేరియట్ స్పందించిన తీరు సరిగ్గా లేదని ఇరాన్ విమర్శించింది. అంతర్జాతీయ చట్టాలను, ఐరాస చార్టర్‌ను ఉల్లంఘించిన అమెరికాను జవాబుదారీగా చేయాలని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్, భద్రతా మండలిని ఇరాన్ కోరింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే వాణిజ్య నౌకలు, పౌరులపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే లక్ష్యంగా అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం ఇరాన్‌పై సరికొత్త సైనిక దాడులను ప్రారంభించింది. అంతకుముందు శనివారం కూడా అమెరికా దళాలు ల్యాండ్, సీ-బేస్డ్ ÷టైర్ ఎయిర్‌క్రాఫ్ట్, డ్రోన్లు, నౌకాదళ నౌకల ద్వారా దాదాపు 140 ఇరాన్ సైనిక లక్ష్యాలపై కచ్చితమైన దాడులు చేశాయి. ఇందులో ఇరాన్ క్షిపణి, డ్రోన్ సైట్లు, నౌకాదళ సామర్థ్యాలు, మందుగుండు సామగ్రి నిల్వ కేంద్రాలు, తీర నిఘా ప్రాంతాలు ఉన్నాయి. అమెరికా దాడుల అనంతరం దక్షిణ ఇరాన్ నగరాలైన జాస్క్, బందర్ అబ్బాస్, సిరిక్‌లలో మూడు భారీ పేలుళ్లు సంభవించినట్లు ఇరాన్ ప్రెస్ టీవీ ధృవీకరించింది. మరోవైపు, ఇరాన్-అమెరికా మధ్య పెరుగుతున్న సైనిక ఘర్షణలపై ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఉద్రిక్తతలు ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర పరిణామాలకు దారితీస్తాయని ఆయన హెచ్చరించారు.

# ప్రతీకార దాడులకు ఇరాన్ ఎత్తుగడ

**ట్రంప్, నెతన్యాహులను మట్టుబెట్టే ప్లాన్**
**తాజాగా స్థానిక మీడియాలో రివెంజ్ లిస్ట్**



**టెహ్రాన్, జూలై 13 :** ఇరాన్‌పై అమెరికా తాజా దాడులతో మ-రోమారు పశ్చిమాసిలో శాంతి కరువయ్యింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌లోని స్థానిక మీడియా.. 13 మంది విదేశీ నేతల పేర్లతో ఉన్న రివెంజ్ లిస్ట్‌ను ప్రచురించడం గమనార్హం. ఆ జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ సహా పలువురు ఐరోపా నేతల పేర్లు ఉన్నాయి. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో నాటి సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తన తండ్రి మరణానికి ప్రతీకారం తీర్చుకుంటానని మొజ్తాబా ఖమేనీ ప్రతిజ్ఞ చేశారు. బాధ్యులైన వారు పర్యవసానాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇది తమ దేశవ్యాప్తంగా ఉన్న డిమాండ్ అని.. దానిని కచ్చితంగా నెరవేరుస్తానని అన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ప్రతీకార జాబితా బయటకు రావడం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉండగా.. ఇరాన్ వ్యాప్తంగా పదుల సంఖ్యలో లక్ష్యాలపై తాము దాడి చేశామని, వాటిలో క్షిపణి, డ్రోన్ ప్రయోగ కేంద్రాలు, మందుగుండు సామగ్రి డంప్‌లు, కమ్యూనికేషన్ సాధనాలు, చిన్న బోట్ల వంటివి ఉన్నాయని అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అనంతరం గల్ఫ్‌లోని పలు దేశాల్లో సైరన్లు వినిపించాయి. బహ్రెయిన్, కువైట్, ఖతార్, జోర్డాన్, ఒమన్‌లోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తాజాగా ఇరాన్ ప్రకటించింది. బహ్రెయిన్‌లోని అమెరికా డ్రోన్ ఫ్లీట్, రెండు క్షిపణి లాంచర్లు, క్షిపణులను నిల్వ చేసిన గిడ్డంగులను ధ్వంసం చేసినట్లు వెల్లడించింది. అగ్రరాజ్యం చేస్తోన్న దాడులతో పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేం దుకు ఇంతకాలంగా జరిగిన దౌత్యచర్చలు నిరుపయోగంగా మారాయని టెహ్రాన్ దుయ్యబట్టింది. అమెరికా వల్లే హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ నౌకాయానానికి అంతరాయం ఏర్పడిందని ఆరోపించింది.

# పౌరసత్వ నిర్ధారణలో పారదర్శకత ముఖ్యం

- అసోంలో 27మంది వ్యక్తుల పౌరసత్వంపై విచారణ
- వారిపై బలవంతపు చర్యలు తీసుకోరాదన్న సుప్రీం

**న్యూఢిల్లీ, జూలై 13 :** పౌరసత్వాన్ని నిర్ధారించే లేదా ఒక వ్యక్తిని విదేశీయుడిగా ప్రకటించే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, న్యాయబద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అస్సాం లోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు 'విదేశీయులు'గా ప్రకటించిన 27 మంది వ్యక్తుల పౌరసత్వ స్థితిపై సోమవారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం ఈ మేరకు కీలక తీర్పునిచ్చింది. 'పౌరసత్వం, విదేశీయుడి హోదా అనేవి అత్యున్నత రాజ్యాంగ, చట్టపరమైన ప్రాముఖ్యత కలిగిన అంశాలు' అని ఈ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. అక్రమంగా పౌరస త్వం పొందాలని చూసే వారిని నిరోధించడంలో ప్రభు త్వానికి స్పష్టమైన ప్రయోజనాలు, బాధ్యతలు ఉంటాయనే విషయాన్ని సుప్రీంకోర్టు అంగీకరించింది. 'చట్టబద్ధంగా అర్హత లేని వ్యక్తులు.. తప్పుడు పత్రాలు, తప్పుడు క్లెయి మ్‌ల ద్వారా భారతీయ పౌరసత్వాన్ని పొందకుండా చూ సేందుకు ప్రభుత్వానికి చట్టబద్ధమైన, బలమైన ఆసక్తి ఉంటుంది. అయితే, తుది విశ్లేషణలో ఆ ఆసక్తి లేదా ప్రయోజనం.. న్యాయబద్ధమైన పక్రియను అధిగమించలే వు'. అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసుకు సంబంధించి గతంలో గౌహతి హైకోర్టు, ఫారినర్స్ ట్రిబ్యునళ్లు ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. ట్రిబ్యునళ్లలో ఈ కేసుపై మరోసారి విచారణ జరిగే వరకు ఆ 27 మంది వ్యక్తులపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకూడదని ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. అయితే, పిటిషనర్ల పౌరసత్వాన్ని నిర్ధారించడానికి తాము ఇంకా ఎటువంటి ఆధారాలను పూర్తిగా పరిశీలించలేదని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టును ఆశ్రయించిన వారిలో సాబిత్రి దేయ్, అజ్బహర్ అలీ, ఎండీ అక్బర్ అలీ, అబేదా ఖాతూన్, అనోవారా ఖాతూన్ అనే వ్యక్తులు ఉన్నారు. పాత ఓటర్ల జాబితాలో పేర్ల స్పెల్లింగ్స్ తప్పుగా పడటం, చిన్న చిన్న తేడాలు ఉండటం వంటి సాంకేతిక కారణాల వల్లే తమను విదేశీ-యులుగా ప్రకటించారని వారు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తాము భారతీయ పౌరులమేనని నిరూపించుకోవడానికి 1971 కంటే ముందు నాటి లెగసీ డేటా, ఓటర్ల జాబితాలు, భూమి రికార్డులను వారు కోర్టుకు సమర్పించారు. కాగా, గత జూన్ నెలలో కూడా ఇలాంటి ఒక కేసులోనే.. ఐదుగురు మహిళలను విదేశాలుగా బహిష్కరించకుండా సుప్రీంకోర్టులోని మరో బెంచ్ అడ్డుకుంది. అవసరమైన అన్ని పత్రాలు సమర్పించినప్పటికీ, కేవలం పేర్ల స్పెల్లింగ్స్‌లో తేడాలు ఉన్నాయనే కారణంతో వారిని విదేశీయులుగా ప్రకటించారని అప్పట్లో కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజా తీర్పుతో అస్సాంలోని ఫారినర్స్ ట్రిబ్యునళ్లు పౌరసత్వ క్లెయిమ్‌లలను పరిశీలిస్తున్న తీరు, వారి ప్రమాణాలపై దేశవ్యాప్తంగా చట్టపరమైన చర్చ మొదలైందని నిపుణులు భావిస్తున్నారు.



# పేపర్ లీక్‌లపై రాహుల్ గాంధీ మండిపాటు

- విద్యా వ్యవస్థ దోపిడీ యంత్రాంగంగా మారిందని విమర్శ
- 'ఛాత్రోన్ కీ గూంజ్'లో విద్యార్థులు పాల్గొనాలని పిలుపు



**న్యూఢిల్లీ, జూలై 14:** దేశంలో వరుసగా జరుగుతున్న ప్రశ్నపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో పెరుగుతున్న అవినీతిపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమ-ర్శలు గుప్పించారు. భారత విద్యా వ్యవస్థ ప్రస్తుతం నిజాయతీ లేని దోపిడీ యంత్రాంగంగా మారిందని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. భారత విద్యా వ్యవస్థ గురించి తాను చేస్తున్న వ్యాఖ్యలు తన వ్యక్తిగత అభిప్రాయాలు కావని, దేశవ్యాప్తంగా విద్యార్థులు వ్యక్తం చేస్తున్న ఆవేదననే తాను ప్రతిబింబిస్తున్నానని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులను భవిష్యత్తుకు సిద్ధం చేయాల్సిన వ్యవస్థ వారిని, వారి కుటుంబాలను అప్పులు, మానసిక ఒత్తిడి, నిరాశల వైపు నెడుతోందని విమర్శించారు. దేశంలో కొనసాగుతున్న అవినీతే ప్రశ్నపత్రాల లీక్ మాఫియాకు ప్రధాన కారణమని రాహుల్ ఆరోపించారు. పోటీ పరీక్షల కోసం సంవత్సరాల పాటు కష్టపడుతున్న లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ఈ మాఫియా ఒక్కసారిగా నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ఈ అంశంపై మౌనం వహిస్తున్నారని విమర్శించారు. జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికే కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. అలాగే ఈ అంశాన్ని ప్రశ్నించాల్సిన మీడియా కూడా దీర్ఘకాలంగా మౌనంగా ఉందని వ్యాఖ్యానించారు.

### 'ఛాత్రోన్ కీ గూంజ్'లో పాల్గొనాలని పిలుపు

దేశ విద్యా రంగంలో సమూల మార్పులు అవసరమని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఛాత్రోన్ కీ గూంజ్' కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. జూలై 17న డెహ్రాడూన్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి హాజరై విద్యార్థుల సమస్యలను మరింత బలంగా వినిపిద్దామని కోరారు. కార్యక్రమానికి సంబంధించిన నమోదు వివరాల లింక్‌ను కూడా తన 'ఎక్స్' పోస్టులో పంచుకున్నారు.

# తమిళనాడులో ఘోర ప్రమాదం

**ఎదురెదురుగా రెండు బస్సులు ఢీకొని ఐదుగురు దుర్మరణం**



**చెన్నై, జూలై 13 :** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు బస్సులు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. సోమవారం తెల్లవారు జామున మదురై జిల్లాలోని కొట్టంపట్టి సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రైవేటు బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను దాటింది. అదే సమయంలో తిరుచిరాపల్లి వైపు వెళ్తున్న ప్రభుత్వ బస్సు ఎదురుగా రావడంతో దానిని ఢీకొట్టి పక్కనే ఉన్న ప్రయాణికుల షెడ్డులోకి దూసుకెళ్లింది. ప్రైవేటు బస్సు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో ప్రభుత్వ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రయాణికులతో సహా.. బస్టాప్‌లో నిద్రిస్తున్న మరో వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మరో 40 మంది గాయపడగా.. వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రైవేటు బస్సు చెన్నై నుంచి మార్తాండం వెళ్తుండగా.. డ్రైవర్ నియంత్రణ కోల్పోవ డంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.

# భూముల రీ సర్వే తో భవిష్యత్తులో వివాదాలు ఉండవు

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియతో భవిష్యత్తులో భూ వివాదాలు ఉండవని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదరపు కలెక్ట ర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య, సర్వే ల్యాండ్ రికార్డ్ ఎ.డి. వినయ్ లతో కలిసి భూముల రీ సర్వే మండలాల తహసిల్దార్లు, మండల సర్వేయర్లు, గిర్దవార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రీ సర్వే కొరకు ఎంపిక చేసిన గ్రామాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా సర్వే నిర్వహించాలని తెలిపారు. భూముల రీ సర్వే ప్రక్రియ ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలకు ఎలాంటి అవకాశం ఉండదని తెలిపారు. మొదటి విడతలో జిల్లాలో గ్రామ నక్షాలు లేని 37 గ్రామాలు ఉన్నాయని, రెండవ విడతలో 70 గ్రామాలు ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. మొదటి విడతలో ఎంపిక చేసిన గ్రామాలలో సర్వే నిర్వహించడంతో గ్రామ నక్షా రూపొందించడం జరుగుతుందని, 2వ విడతలో ఎంపికైన గ్రామాలలో రీ సర్వేలో భాగంగా ఎంజాయ్మెంట్ సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సర్వే ప్రక్రియలో డి జి పి ఎస్, రోవర్స్ ను ఉపయోగించడం జరుగుతుందని, సర్వే పూర్తి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రీ సర్వేతో భవిష్యత్తులో రైతుల మధ్య పొలాల గెట్ల గొడవలు ఉండవని, రెవెన్యూ, అటవీ శాఖల మధ్య వివాదాలు గల భూముల సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. సర్వే ఉద్దేశం ప్రజలకు వివరించి ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో జిల్లా మంచి స్థానంలో ఉందని, ప్రస్తుతం 67 శాతం ఫారాల డిజిటలైజేషన్ జరిగిందని, వారంలోగా ఎన్యువరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ 100 శాతం పూర్తిచేయాలని తెలిపారు. సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, కుల, ఆదాయ, నివాస, ఇతర ధ్రువీకరణ పత్రాల కొరకు వచ్చిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చు

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలో 19 సంవత్సరాల వయసు ఉన్న ప్రతి ఒక్కరూ ఆల్బెండజాల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 19 సంవత్సరాల లోపు పిల్లలు, యుక్త వయసు ఉన్న వారందరికీ నులిపురుగు నివారణ మాత్రలు అందించాలని, ఈ మాత్రలు తీసుకోవడం ద్వారా పిల్లలలో నులిపురుగులను నివారించవచ్చని, పోషణ మెరుగుపడుతుందని, ఆరోగ్యకర ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. తద్వారా పిల్లలు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై చదువుపై దృష్టి పెరుగుతుందని, మంచి భవిష్యత్తుకు సహాయపడుతుందని తెలిపారు. ఆల్బెండజోల్ కు మాత్రలు విద్యార్థులకు అందించడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి నాగేంద్ర, వైద్య సిబ్బంది, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఎఫ్ఎల్ఎన్ బేస్ లైన్ పరీక్షలపై ప్రాథమిక ఉపాధ్యాయులకు శిక్షణ



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ బేస్‌లైన్ పరీక్షల నిర్వహణపై ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు సోమవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఒక రోజు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఆసిఫాబాద్, మొవాడ్, వాంకిడి స్కూల్ కాంప్లెక్స్‌ల (పాఠశాల సముదాయాలు) సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పి.ఎం.ఆర్.సి. ఏ.సి.ఎం.ఓ. పూర్కా ఉద్ధవ్ హాజరై మాట్లాడారు. ఎఫ్ఎల్ఎన్ బేస్ లైన్ పరీక్షల ముఖ్య ఉద్దేశ్యాన్ని, పరీక్షలను నిర్వహించాల్సిన విధానాన్ని ఆయన ఉపాధ్యాయులకు వివరించారు. ప్రతి విద్యార్థి యొక్క అభ్యాస (నేర్చుకునే) స్థాయిని ఉపాధ్యాయులు ఖచ్చితంగా అంచనా వేయాలని, ఆ స్థాయికి అనుగుణంగానే భవిష్యత్తు బోధన ప్రణాళికలు చేపట్టాలని ఆయన సూచించారు.సమావేశంలో పాల్గొన్న ఆసిఫాబాద్, మొవాడ్, వాంకిడి పాఠశాల సముదాయాల ప్రధానోపాధ్యాయులు పవార్ లింబారావ్, మాడుగుల నారాయణమూర్తి, సోయం ఇంద్రలు ప్రసంగిస్తూ, ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడానికి ఉపాధ్యాయులందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం ఎస్సీఆర్పీలు రాథోడ్ రవీందర్, కూడ్మేత అనంత్‌లు ఉపాధ్యాయులకు బేస్‌లైన్ పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాల మూల్యాంకన విధానం, రికార్డుల నిర్వహణ మరియు ఫలితాల విశ్లేషణ వంటి పలు కీలక అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

# జర్నలిస్టు ల సమస్యలు పరిష్కరించాలి

- **టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పని చేస్తున్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) ఆధ్వర్యంలో కలెక్టర్ కె. హరిత కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. సురేందర్ రావు, పర్వతి రాజశేఖర్ లు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి పాటు పడుతున్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో జర్నలిస్టులు పనిచేస్తున్నారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు తక్షణమే ఇవ్వాలన్నారు. లేనిపక్షంలో టీడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజెఎఫ్ ఉపాధ్యక్షులు పి . నాగేందర్, కోశాధికారి జె లలిత్ కుమార్, సభ్యులు జె. మధుకర్, బి. కిరణ్ కుమార్, ముకశిర్ పాషా, ఎం. యాదగిరి, బి. వెంకన్న, పి. సంతోష్, ఎండి ఇసాక్, ధనుంజయ్, జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

- **పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ**



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని గుత్పాల గ్రామంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, మినీ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఎండి సద్దాం మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలు పిల్లల్లో రక్తహీనతను తగ్గించడమే కాకుండా రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. అపరిశుభ్రత కారణంగా కడుపులో చేరే నులిపురుగులు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, దీంతో ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ సంతోష్, ఏఎన్ఎం కల్పన, అంగన్వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలో కార్మికుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా లేబర్ హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో సోమవారం ఒక ప్రత్యేక ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న కార్మికులకు వైద్య సిబ్బంది ఉచితంగా రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, షుగర్ పరీక్షలతో పాటు పలు ఇతర సాధారణ ఆరోగ్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి తగిన వైద్య సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమానికి రాజంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ బుర్సా పోచయ్య హాజరై మాట్లాడుతూ రాజంపేట గ్రామపంచాయతీ ప్రజల ఆరోగ్యం, అలాగే కార్మికుల సంక్షేమానికి మా పాలకవర్గం ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్మికుల శ్రమను గుర్తిస్తూ, వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం నిజంగా అభినందనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యుల ఫోరం జిల్లా అధ్యక్షులు గులాం జావిద్ , గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పీఆర్టీ యూ తెలంగాణ వినతి



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** రాష్ట్రంలోని ఉపాధ్యాయుల వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రతినిధులు సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ఉపాధ్యాయులకు ఒకే విధమైన ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గురుకుల, మోడల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులతో పాటు కాంట్రాక్ట్ ఉద్యోగులకు కూడా ఉద్యోగ ఆరోగ్య పథకం వర్తింపజేయాలని కోరారు. అదేవిధంగా సీనియర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాధికారులుగా అదనపు బాధ్యతలు అప్పగించాలని కోరారు. ఉపాధ్యాయుల సంక్షేమం, సేవా భద్రతకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నాకర్ రావు, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆడే నూర్ సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ర నవీన్ యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విఠల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



**ఉద్యమ కెరటం, తాండూర్:** జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మాదారం గ్రామపంచాయతీలోని అంగన్వాడీ సెంటర్ 3లో టీచర్ కుసనపల్లి మీన నిర్వహించిన కార్యక్రమంలో మాదారం సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలందరికీ నులిపురుగుల నివారణకు సంబంధించిన ఆల్బెండజోల్ మాత్రలను వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వేశారు. చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 1 నుండి 19 సంవత్సరాలు గల పిల్లలందరికి ప్రభుత్వం అందించే ఈ మాత్రలను తల్లిదండ్రులు తప్పనిసరిగా వేయించాలని చెప్పారు. ఈ మాత్రను ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రతి అంగన్వాడి సెంటర్లలో వేయడం జరుగుతుందని అన్నారు. పిల్లల్లో రక్తహీనతను నిరోధించడానికి, వారు ఆరోగ్యంగా, చురుకుగా ఉండడానికి ఈ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అలాగే తాండూర్ యూపీఎస్ పాఠశాలలో ఏఎన్ఎం శోభారాణి నిర్వహించిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమ్మరి సత్యనారాయణ పాల్గొని ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమంలో మాదారం ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు గొల్లపల్లి బానేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీవాణి, ఏఎన్ఎం పద్మ, ఆశా వర్కర్ మల్లీశ్వరి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నులిపురుగుల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలి





## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** నులిపురుగులను నిర్మూలించి పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపర్చేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆశ్రమ బాలికల పాఠశాలలో నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్తో కలిసి పాల్గొని విద్యార్థులకు స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లోని పిల్లలందరికీ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య, విద్య, సంక్షేమ, మున్సిపల్, గ్రామ పంచాయతీ తదితర శాఖలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. నులిపురుగుల నిర్మూలన ద్వారా పిల్లల్లో రక్తహీనత తగ్గి, పోషకాహార స్థాయి మెరుగుపడడంతో పాటు శారీరక, మానసిక ఎదుగుదల, అభ్యాస సామర్థ్యం, పాఠశాల హాజరు శాతం పెరుగుతాయని తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, భోజనానికి ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన నీటిని తాగడం వంటి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంగ్లిష్ ఉపాధ్యాయుల సమగ్ర శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఈనెల 13 నుంచి 15 వరకు నిర్వహిస్తున్న ఈ శిక్షణలో ఉపాధ్యాయులు ఆధునిక బోధన పద్ధతులను అవగాహన చేసుకుని విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన పెంపొందించేలా బోధన సాగించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సాకారం

- ఇందిరమ్మ గృహప్రవేశంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్
- వేంసూరుకు గోదావరి జలాల రాకపై హర్షం వ్యక్తం



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** పేదల సొంతింటి కల సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు రాజీవ్ కాలనీలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ గృహప్రవేశ కార్యక్రమంలో పాలొగని రాజీవ్ కాలనీకి చెందిన లబ్ధిదారులు శ్రీరాముల లక్ష్మి , కృష్ణ నూతన గృహప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ప్రతి పేద కుటుంబం సొంతింటి కలను సాకారం చేసుకోవడం ఎంతో ఆనందదాయకమైన విషయమని పేర్కొన్నారు. నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలకు గూడు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సత్తుపల్లి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రెహాన బేగం కమల్ పాషా, 7వ వార్డు కౌన్సిలర్ నసీమ షరీఫ్, కౌన్సిలర్లు హకీమ్, శరత్, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, రాజీవ్ కాలనీ ఇందిరమ్మ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### గోదావరి జలాల రాక రైతులకు ఊరట..

వేంసూరు మండలానికి గోదావరి జలాలు చేరడంపై ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ హర్షం వ్యక్తం చేశారు. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు గోదావరి జలాల రాక ఎంతో ఊరటనిస్తుందని పేర్కొన్నారు. కాల్వల్లో నీరు ప్రవహిస్తుండటంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయని, వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న రైతులకు సాగునీరు అత్యంత కీలకమని అన్నారు. గోదావరి జలాలు వేంసూరు మండలానికి చేరడం రైతాంగానికి శుభపరిణామమని అన్నారు. పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# సీపీఎం మహా ధర్నా కరపత్రాల విడుదల




**ఉద్యమ కెరటం, తాండూర్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న హైదరాబాద్లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నా కరపత్రాలను సీపీఎం పార్టీ తాండూర్ మండల కార్యదర్శి డి.రాజారాం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు విడుదల చేవారు. సోమవారం తాండూర్ మండల కేంద్రంలోని భగత్సింగ్ భవన్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం నేడు ప్రపంచంలో అత్యధిక యువశక్తి కలిగిన దేశమని, యువశక్తి సామర్థ్యాన్ని దేశ అభివృద్ధికి ఉపయోగించుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారన్నారు. నిరుద్యోగ కూరల్లో చిక్కిన యువత భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు కావస్తున్నా రోజురోజుకు నిరుద్యోగ సమస్య తీవ్రమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగ హామీని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 10 లక్షలకు పైగా ఖాళీ ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలను వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేంత వరకు నెలకు రూ.5వేల నిరుద్యోగ భృతి ఇవ్వాలని, ఎలాంటి వివాదాలు, కోర్టు కేసులు లేకుండా వివాదాస్పదమైన జీవోలను తొలగించి పారదర్శకంగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దుర్గం నాన్నయ్య, కెవిపిఎస్ తాండూర్ మండల కార్యదర్శి వెల్పుల శంకర్, వ్యవసాయ కార్మిక సంఘం తాండూరు మండల అధ్యక్షులు బొల్లం రాజేశం, మొగిలి, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ రాజర్షిషా



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. ప్రజావాణి పోర్టల్లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువులోగా పరిష్కరించడం సంబంధిత అధికారుల ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వయంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, సామాజిక భద్రత పెన్షన్లు, ఉపాధిహామీ పథకం, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించిన మొత్తం 85 ఫిర్యాదులు అందాయి. వీటిపై తక్షణ చర్యలు తీసుకుని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరిష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీఓలు, తహశీల్దార్లు, శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో ప్రజావాణి పోర్టల్లో నమోదు చేయాలని పేర్కొన్నారు. ఒకే సమస్యపై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని, అప్పీల్ కేసులను రెండు నుంచి మూడు రోజుల్లోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాజేశ్వర్, ఆర్ఎస్.చిత్రు, ఏఓ వర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లను పరిశీలించిన ఎంపీడీఓ



**ఉద్యమ కెరటం, తిర్యాణి:** మండలంలోని ఏదులపహాడ్ గ్రామపంచాయతీలో నిర్మిస్తున్న గృహాలను సోమవారం మండల అభివృద్ధి అధికారి నగేష్ సందర్శించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పీఎం జన్ మన్ పథకం కింద మంజూరు చేసిన నివాస గృహాలను సందర్శించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. అలాగే మురికి కాలువలు లేక ఇబ్బందులు పడుతున్న నివాస గృహాలను సందర్శించి వారికి మురికి కాలువలను నిర్మించే ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతోపాటు పంచాయతీలోని సర్ సర్వేను పరిశీలించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ మడావి పార్వతి అంబారావు, కార్యదర్శి అశోక్, కారోబారి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

# పట్టుదలే ఆమె ఆయుధం..

## టీజీ టెట్లో సత్తా చాటిన నేరడిగొండ బిడ్డ






**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నిరంతర కృషి, పట్టుదల ఉంటే ఎంతటి కష్టతరమైన లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని నిరూపించింది నేరడిగొండ మండలకేంద్రానికి చెందిన తాళ్ళ ప్రియాంక. తాజాగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన టీజీ టెట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి అందరి ప్రశంసలు అందుకుంటోంది. టీజీ టెట్ పేపర్–1 పరీక్షలో ప్రియాంక అద్భుతమైన స్కోరు సాధించింది. మొత్తం 150 మార్కులకు గాను, 126 మార్కులు సాధించి తన విద్యా ప్రతిభను చాటుకుంది. టెట్ వంటి పోటీ పరీక్షల్లో 126 మార్కులు సాధించడం గొప్ప విషయమని, ఇది తన కష్టానికి దక్కిన ప్రతిఫలమని ప్రియాంక సంతోషం వ్యక్తం చేశారు. ఈ విజయం గురించి ప్రియాంక మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన ప్రణాళికాబద్ధమైన చదువే నన్ను ఈ స్థాయికి చేర్చిందని, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం నా విజయానికి తోడయ్యాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మక్కువతోనే నేను ఈ పరీక్షకు సన్నద్ధమయ్యానని, ఈ మార్కులు రావడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ప్రియాంక విజయంపై నేరడిగొండ మండల ప్రజలు, స్నేహితులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చి, పోటీ పరీక్షల్లో ఇంతటి ప్రతిభను కనబర్చడం స్థానిక విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పలువురు కొనియాడుతున్నారు. భవిష్యత్తులో మరిన్ని పోటీ పరీక్షల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ విజయం ప్రియాంక ఉపాధ్యాయ వృత్తి వైపు వేస్తున్న అడుగులకు మరింత ఉత్సాహాన్ని ఇచ్చేలా ఉందంటున్నారు.

# కష్ట కాలంలో అండగా నిలిచిన సర్పంచ్ తొడసం రాజేందర్

## మృతురాలి కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సాయం



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పవర్గూడా గ్రామపంచాయతీకి చెందిన అనక లక్ష్మీబాయి అనారోగ్యంతో మృతి చెందగా, గ్రామ సర్పంచ్ తొడసం రాజేందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి తనవంతు సహాయాన్ని అందజేశారు. విషయం తెలుసుకున్న వెంటనే మృతురాలి నివాసానికి చేరుకున్న సర్పంచ్ రాజేందర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా తన వ్యక్తిగత సహాయంగా రూ.3వేల నగదు అందించి, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. మృతురాలి కుటుంబం ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను సిద్ధంగా ఉంటానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కూడా మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# జంగంపల్లి లో సొంత నిధులతో ఎస్ ఐఆర్ సర్వేకు వాలంటీర్ ఏర్పాటు



**ఉద్యమ కెరటం,భిక్కనూరు:** బిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ సర్వేలో భాగంగా గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్పంచ్ వాణి వాసు యాదవ్ సొంత నిధులతో గత నాలుగు రోజులుగా వాలంటీర్ను ఏర్పాటు చేశారు. గ్రామస్తులు పలు సూచనలు చేసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రకాష్, కిసాన్ సంఘం అధ్యక్షులు వెంకటేశం, నాయకులు సత్యం, యాదయ్య, రాములు, పోచయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో సర్వే ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు ప్రజలు సహకరించాలని వారు కోరారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే పునాది

## జిల్లా కలెక్టర్ కె. హరిత




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే బలమైన పునాది అని జిల్లా కలెక్టర్ కె. హరిత స్పష్టం చేశారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల రిసోర్స్ పర్సన్స్ కోసం ఏర్పాటు చేసిన మూడు రోజుల జిల్లా స్థాయి సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం సోమవారం ఆసిఫాబాద్‌లోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యా వ్యవస్థకు ప్రాథమిక ఉపాధ్యాయులే అసలైన మూల స్తంభాలని కొనియాడారు. ప్రతి చిన్నారిలో చదవడం, రాయడం, గణించడం (FLN నైపుణ్యాలు) వంటి ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించే గొప్ప బాధ్యత ప్రాథమిక ఉపాధ్యాయులపైనే ఉంది. ఈ శిక్షణలో నేర్చుకున్న ఆధునిక బోధనా విధానాలను తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి విద్యార్థి అభ్యసన ఫలితాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులకు వినూత్న బోధనా పద్ధతులు, సమగ్ర బోధన, విద్యార్థి కేంద్రిత అభ్యాసం మరియు అభ్యసన ఫలితాల మెరుగుదల వంటి కీలక అంశాలపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎంఆర్‌పిలకు దిశా నిర్దేశం చేశారు. ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించడం, బోధనను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడమే ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. జూలై 13 నుండి 15 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో జిల్లాలోని అన్ని మండలాల నుండి ఎంపికైన ఎంఆర్‌పిలు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీ సచ్చిదానంద చారి, క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, కోర్స్ ఇన్చార్జి అదే ప్రకాష్, జిల్లా స్థాయి రిసోర్స్ పర్సన్లు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వేంసూరుకు గోదావరి జలాలు..

- అన్నదాతల్లో వెల్లివిరిసిన ఆనందం
- మంత్రి తుమ్మల కృషితో కాల్వల్లోకి నీరు..
- ఖరీఫ్ సాగుపై రైతుల్లో కొత్త ఆశలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వర్షాలు ముఖం చాటేయడంతో ఖరీఫ్ సాగుపై తీవ్ర ఆందోళనలో ఉన్న వేంసూరు మండల రైతులకు గోదావరి జలాలు కొత్త ఊపిరినిచ్చాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు మండలానికి చేరుకోవడంతో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరిసింది. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు కాల్వల ద్వారా నీరు చేరడంతో ఖరీఫ్ పంటల సాగుపై నెలకొన్న అనిశ్చితి తొలగింది. గోదావరి జలాల రాక రైతుల్లో కొత్త ఆశలు నింపగా, పంటల సాగుకు కొండంత భరోసా లభించిందని వారు పేర్కొన్నారు. గోదావరి జలాల రాక సందర్భంగా వేంసూరు మండలంలోని కుంచపర్తి రెగ్యులేటర్ వద్ద రైతులు ఘనంగా సంబరాలు నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాన్ని ప్రదర్శిస్తూ కాల్వ వెంబడి ర్యాలీ నిర్వహించారు. గోదావరి జలాలకు పూలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. "జయహో తుమ్మల", "రైతు బాంధవుడు తుమ్మల" అంటూ రైతులు చేసిన నినాదాలతో కుంచపర్తి రెగ్యులేటర్ పరిసరాలు మార్మోగాయి. కాల్వలో ఉరకలెత్తుతున్న గోదావరి జలాలను చూసి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో సాగు ఎలా చేపట్టాలనే ఆందోళన రైతులను వెంటాడింది. ఇలాంటి సమయంలో గోదావరి జలాలను ఈ ప్రాంతానికి అందించడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చూపిన ప్రత్యేక చొరవ రైతులకు అండగా నిలిచిందని మండల రైతులు తెలిపారు. "కాల్వలో గోదావరి నీరు ప్రవహిస్తుండటం చూస్తుంటే మా పొలాలకు మళ్లీ జీవం వచ్చినట్లుంది. రైతుల కష్టాలను గుర్తించి సాగునీరు అందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు" అని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గోదావరి జలాల రాకతో వేంసూరు మండలంలో పండుగ వాతావరణం నెలకొనగా, అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు విరిశాయి. రైతులు ఈ ఖరీఫ్ సీజన్లో మంచి పంటలు పండుతాయనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# చిన్నారుల ఆరోగ్యమే సమాజానికి బలం






- జిల్లా కలెక్టర్ రాజర్షిషా
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ.. చిన్నారులకు అక్షరాభ్యాసం

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** చిన్న వయస్సు నుంచే పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం ద్వారానే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రాహ్మణవాడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల సమస్య కారణంగా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడి వారి శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణకు నులిపురుగుల నిర్మూలన అత్యంత అవసరమని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలందరికీ వంద శాతం ఆల్బెండజోల్ మాత్రలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పిల్లలకు ఆరోగ్యంతో పాటు నాణ్యమైన విద్యను అందించడం ప్రతిఒక్కరి బాధ్యత అని అన్నారు. అనంతరం పాఠశాలలో ప్రాంగణంలో చిన్నారులకు కలెక్టర్ స్వయంగా అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు తనవంతు సందేశాన్ని అందించారు. అలాగే ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను అధికారులతో కలిసి పరిశీలించారు. దరఖాస్తు ఫారాలను సకాలంలో స్వీకరించి డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని బీఎల్ఓలు, సూపర్వైజర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ మాధవి, డీఎంహెచ్ఓ డాక్టర్ సాధన, డీఐఈఓ గణేష్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి వైసి. శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అపర్ణ, స్థానిక కౌన్సిలర్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అప్పుల ఊబిలో గ్రామ పంచాయతీ భవనం

## బిల్లుల కోసం చైర్మన్ ఆవేదన






**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఓ వైపు గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఆరాటపడుతుంటే, మరోవైపు ప్రభుత్వాల నిర్లక్ష్యం స్థానిక సంస్థల ప్రతినిధులను అప్పుల పాలు చేస్తోంది. నేరడిగొండ మండలం సావర్గాం గ్రామ పంచాయతీ భవన నిర్మాణం పూర్తి కావడానికి ఏళ్లు గడుస్తున్నా, నేటికీ బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్మాణకర్తలు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

### వడ్డీ భారంతో సతమతం..

ఐటీడీఏ నిధులు రూ.20 లక్షలతో గత ప్రభుత్వ హయాంలో సావర్గాం గ్రామ పంచాయతీ భవన నిర్మాణం ప్రారంభమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే భవన ప్రారంభోత్సవం కూడా జరిగింది. అయితే బిల్లులు మాత్రం ఇప్పటికీ పెండింగ్లోనే ఉన్నాయి. నిర్మాణ పనుల కోసం తీసుకున్న అప్పులకు అసలు కంటే వడ్డీ భారం పెరిగిపోయి సదరు కాంట్రాక్టర్లు, నిర్మాణకర్తలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

### బిల్లులు రాకపోతే ఆత్మహత్యలే మార్గం: వీటీడీఏ చైర్మన్

ఈ అంశంపై వీటీడీఏ చైర్మన్ మహేందర్ జాధవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం తాము అప్పులు చేసి పనులు చేయిస్తే, ప్రభుత్వాలు బిల్లుల మంజూరులో తాత్సారం చేస్తూ తమను ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. "అప్పు తీరేదెప్పుడు..? ముద్ద దిగేదెప్పుడు..? అని నిర్మాణకర్తలు రోదిస్తున్నారు. అభివృద్ధి పనులు చేయించిన పాపానికి చైర్మన్లను అప్పుల పాలు చేయడం ఎంతవరకు సమంజసం..? బిల్లులు మంజూరు చేయని పక్షంలో, అప్పుల బాధతో ఆత్మహత్యలే దిక్కయ్యేలా పరిస్థితులు ఉన్నాయనిని మండిపడ్డారు.

### ప్రభుత్వానికి విన్నపం..

ప్రభుత్వం గ్రామ పంచాయతీ భవన నిర్మాణ బిల్లుల విషయంలో తక్షణమే ప్రత్యేక దృష్టి సారించాలని, పెండింగ్లో ఉన్న నిధులను విడుదల చేసి నిర్మాణ కర్తలను, ప్రజా ప్రతినిధులను ఆదుకోవాలని మహేందర్ జాధవ్ డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల అభివృద్ధికి బాసటగా నిలవాల్సిన ప్రభుత్వం, బిల్లులు మంజూరు చేయకపోవడంతో గ్రామీణాభివృద్ధి కుంటుపడుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ సమస్యపై సంబంధిత ఉన్నతాధికారులు, ప్రభుత్వం స్పందిస్తే తప్పా అప్పుల ఊబిలో కూరుకుపోయిన సదరు కాంట్రాక్టర్లకు విముక్తి లభించే అవకాశం లేదు.

# నులిపురుగుల నివారణ కోసం ఆరు నెలలకోసారి మాత్రలు



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా బెజ్జూర్ మండలంలోని పలు విద్యా సంస్థల్లో సోమవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు వైద్య ఆరోగ్య శాఖ సూపర్వైజర్ శారద తెలిపారు. మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం అల్పాహారం, ఆల్బెండజోల్ మాత్రలు అందజేయగా, గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తర్వాత మాత్రలను పంపిణీ చేశారు. 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ఒక్కొక్క ఆల్బెండజోల్ మాత్ర చొప్పున అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నులిపురుగుల కారణంగా పిల్లల్లో రక్తహీనత, పోషకాహార లోపం, శారీరక ఎదుగుదలలో ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ సమస్యలను నివారించేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ విశ్వ ధర్మక్షేత్రంలో మోక్ష రుద్రేశ్వర స్వామికి విశేష పూజలు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి మండల పరిధిలోని బొగ్గపాడు గ్రామంలోని శ్రీ విశ్వ ధర్మక్షేత్రంలో సోమవారం శ్రీ మోక్ష రుద్రేశ్వర స్వామివారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వ ధర్మక్షేత్రం వ్యవస్థాపకులు, ఆగమ వాస్తు జ్యోతిష్య సిద్ధాంతి వెల్లటూరి ప్రసాదాచారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు పవన్, వేద పాఠశాల విద్యార్థులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి మహా రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిల్వదళార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం మహానందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అభిషేకం చేసి భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. సోమవారం అలభ్య పుణ్యతిథి, మహిమాన్వితమైన ఆరుద్ర నక్షత్రం, మాస శివరాత్రి, కృష్ణ చతుర్థి ఒకే రోజున రావడంతో ఈ దినానికి విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఏర్పడిందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీస్సులు పొందారు. వేదమంత్రాలు, శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకోగా, కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలి

## డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**ఉద్యమ కెరటం, జైనూర్:** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ప్రతి గ్రామంలో వంద శాతం పూర్తి చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, బీఎల్ఏలకు సూచించారు. సోమవారం జైనూర్ మండలంలోని జంగాం, ఆశపల్లి, రాంనాయక్ తండా గ్రామాల్లో పర్యటించి ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ల వివరాల నమోదు, దరఖాస్తు ఫారాలు నింపడంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని సూచించారు. బీఎల్ఓలు నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీ బీఎల్ఏలు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదయ్యేలా కృషి చేయాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జంగాం గ్రామంలో 64 శాతం, ఆశపల్లి గ్రామంలో 87 శాతం, రాంనాయక్ తండాలో 80 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన ప్రక్రియను కూడా వేగవంతంగా పూర్తి చేసి ప్రతి అర్హుడైన ఓటరుకు అవకాశం కల్పించాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఫారాలు నింపడంలో సహాయం చేయడంతో పాటు ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యవర్గ సభ్యులు షేక్ ముఖీద్, పెందోర్ ప్రకాష్, ఆత్మ చైర్మన్ రాథోడ్ రమేష్, సర్పంచ్లు పెందోర్ అనసూయ అర్జున్, రాథోడ్ రాందాస్, మర్ప రవీందర్, ఆత్రం శశిపాల్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ, చిల్లే లక్ష్మణ్, పార్టీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి





- **జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య**

ఉద్యమ కెరటం, మంచిర్యాల: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలంటే ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధన నైపుణ్యాలను పెంపొందించుకుంటూ విద్యార్థి కేంద్రిత బోధనకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. సోమవారం మంచిర్యాల పట్టణంలోని ఓల్డ్ మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మూడు రోజుల సమగ్ర ఇన్సర్వీస్ ఉపాధ్యాయుల జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని బెల్ల ంపల్లిమండల విద్యాధికారి, ప్రాజెక్టు కోఆర్డినేటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొంటున్న ఉపాధ్యాయులతో ముఖాముఖి నిర్వహించి శిక్షణలో బోధిస్తున్న అంశాలు, అభ్యాస బోధన విధానాలు, తరగతి గదిలో వాటి అమలు, విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలకు చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలతో పాటు విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకతను పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం శిక్షణ నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, శిక్షణా సామగ్రి, తరగతి నిర్వహణను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. శిక్షణ కార్యక్రమాలు లక్ష్యాలకు అనుగుణంగా సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు శిక్షణ అనంతరం బోధన విధానాల అమలును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు , ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మండలంలో కోతుల పరేషాన్

**ఆగమవుతున్న రైతులు..!**

**ఉద్యమ కెరటం, కెరమెరి:** కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని పలు గ్రామాల్లో కోతులు రైతులను, ప్రజలను తీవ్రంగా పరేషాన్ చేస్తున్నాయి. అడవుల్లో ఆహారం దొరక్కపోవడంతో గుంపులు గుంపులుగా గ్రామాలపై, పంట పొలాలపై దాడి చేస్తున్నాయి.

**పంటలకు తీవ్ర నష్టం..**

ప్రస్తుతం వానాకాలం సీజన్ ప్రారంభమై పంటలు ఎదుగుతున్న తరుణంలో, కోతుల మందలు పొలాల్లో మొక్కలను పీకేస్తూ, నాశనం చేస్తున్నాయి. చేతికొచ్చే పంటలు కోతుల పాలు కావడంతో రైతులు ఏం చేయాలో పాలుపోక తలలు పట్టుకుంటున్నారు. పొలాల వద్ద కాపలా





ఉంటున్నా, గుంపులుగా వస్తున్న కోతులను తరిమేయడం రైతుల వల్ల కావడం లేదు. ఓ వైపు పెట్టు బడులు పెరిగి ఇబ్బంది పడుతుంటే, మరోవైపు ఈ కోతుల బెడద మమ్మల్ని కోలుకోకుండా చేస్తున్నాయని, అటవీ శాఖ, మండల అధికారులు స్పందించి కోతులను పట్టుకుని దట్టమైన అడవుల్లో వదిలేయాలని మండల రైతులు కోరుతున్నారు.

**గ్రామాల్లో నూ తప్పని తిప్పలు..**

పంట పొలాలే కాకుండా గ్రామాల్లోకి చొరబడుతున్న కోతులు ఇళ్లపైకి ఎక్కడం, పెంకులు పగలగొట్టడం, ఇళ్ల లో ఉన్న ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం వంటి వాటితో ప్రజలను భయభ్రాంతులకు గురవుతున్నారు. చిన్న పిల్ల లు, వృద్ధులు బయటకు రావాలంటనే జంకుతున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్లుతో కలిసి అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజావాణిలో తాండూర్ మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన బోయిని శ్రీనివాస్ ఏజెన్సీ ప్రాంతంలో ఇంటి నంబరు మార్పునకు అనుసరించాల్సిన విధానాన్ని తెలియజేయాలని దరఖాస్తు సమర్పించారు. తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన చీకటి కిషోర్ కుమార్ గౌడ్ గ్రామపంచాయతీ మురుగు కాలువపై నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరారు. చెన్నూర్ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన నిట్టూరి మధుకర్ తన తాతకు చెందిన ఆస్తిని తనకు తెలియకుండా పట్టా మార్పిడికి ప్రయత్నిస్తున్నారని, వాటిని నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. మందమర్రి మండలం చిర్రకుంట గ్రామ రైతులు తమ పొలాలకు వెళ్లే ప్రభుత్వ దారిని ఆక్రమణల నుంచి విముక్తి చేసి పునరుద్ధరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్



మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 52 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమన్వయంతో పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం గత వరదల్లో మంచిర్యాల పాత పట్టణ ప్రాంతంలో వరద నీటిలో కొట్టుకుపోయి మృతి చెందిన గొర్రెలకు సంబంధించి యజమాని పొనవేని రాజబాబుకు రూ.1.25 లక్షల నష్టపరిహారం చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పిల్ల ల సంపూర్ణ ఆరోగ్యమే దేశ భవిష్యత్తు

**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఉత్తమైన విద్యాభ్యాసం సాధ్యమవుతుందని కుమారి గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండలంలోని కుమారి గ్రామంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్ల ల్లో రక్తహీనతను నివారించి, శారీరక ఎదుగుదలకు ఆల్బెండజోల్ మాత్రలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ మందుల రమేష్, ఉప సర్పంచ్ రవి, వార్డు సభ్యులు ఆకాష్, గోండ్ల సంతోష్, లలిత, బ్రహ్మయ్య, రమణయ్య, గ్రామ కార్యదర్శి దత్తాత్రేయ, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మధుసూదన్, గంగయ్య, ఏఎన్ఎం రాణి, అంగన్వాడీ టీచర్లు సుమలత, ఆశా వర్కర్ పుష్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.



# జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహణ

- **కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ...**

**ఉద్యమ కెరటం,కామారె:**
జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని 38వ వార్డు ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంఘ్వాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారులకు ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల నివారణ పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వ



సూచనల మేరకు అర్హులైన ప్రతి చిన్నారికి ఆల్బెండాజోల్ మాత్రలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు తప్పనిసరిగా మాత్రలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ మాట్లాడుతూ నులిపురుగుల నివారణ ద్వారా పిల్ల ల్లో రక్తహీనత, పోషకాహార లోపం వంటి సమస్యలను తగ్గించవచ్చని తెలిపారు. పిల్లల శారీరక, మానసిక వికాసానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు గొనె శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ పర్వతాలు, సీనియర్ నాయకులు చాట్ల రాజేశ్వర్, అమీర్, సూరి, రాజేష్, సోహిల్, శ్రీకాంత్, సూర్యప్రకాశ్, నాగార్జున్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ముగ్గు పోసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శ్రీకారం

**తిప్పాపూర్‌లో లబ్ధి దారులకు అండగా ప్రజాప్రతినిధులు**



**ఉద్యమ కెరటం,భిక్కనూరు:**
బిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామంలో ఇటీవల ప్రభుత్వం గుడిసెల్లో నివసిస్తున్న 13 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేయగా, వారిలో ముగ్గురు లబ్ధిదారులు సోమవారం ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఇంటి స్థలంలో ముగ్గు పోసి, కొబ్బరికాయ కొట్టి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుంట లింగారెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి , ఉప సర్పంచ్ జీవన్, మాజీ సర్పంచ్ పైడి సాయిరెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ధర్మయ్య, మహేష్, పాలకవర్గ సభ్యులు పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసుకుని సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని సూచించారు.

# విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ

- **జాతీయ నులిపురుగు నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమం...**



**ఉద్యమ కెరటం,భిక్కనూరు:**
జాతీయ నులిపురుగు నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని బిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడానికి నులిపురుగుల నివారణ ఎంతో అవసరమని అన్నారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా ఆల్బెండాజోల్ మాత్రలు తీసుకోవాలని, పిల్ల ల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ జి. వినోద్ గౌడ్, భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఏమిమా దేవి, వీడీసీ అధ్యక్షులు మద్ది సూర్యకాంత్ రెడ్డి, వీడీసీ కార్యదర్శి నాగర్తి చిన్న భూంరెడ్డి, ఉపాధ్యాయులు ఉమారాణి, విశాల, హెచ్‌ఈఓ వెంకటరమణ, ఏఎన్ఎం మాధవి, సతీష్, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టా లి

- **అధికారులకు మున్సిపల్ చైర్ పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ఆదేశం..**



**ఉద్యమ కెరటం,కామారె:**
జిల్లా కేంద్రంలోని 6వ వార్డు పరిధిలోని పాతరాజంపేట విద్యానికేతన్–నర్సన్నపల్లి చౌరస్తా వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ సోమవారం సంబంధిత అధికారులతో కలిసి ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.చౌరస్తాలో ప్రమాదాలకు కారణమవుతున్న పరిస్థితులను పరిశీలించిన చైర్‌పర్సన్, ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట్ల హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు, రిఫ్లె క్టర్లు రోడ్డు మార్కింగ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలను అమలు చేయాలని సూచించారు.ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, భవిష్యత్తులో ప్రమాదాలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నిట్టు గంగాధర్, మాజీ సర్పంచ్ రవి, నాయకులు నాగార్జున్, సూరి, సూర్యప్రకాశ్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## సీఎస్కే కొత్త కోచ్ రేసులో

# ధోనీ, అశ్విన్!

ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటైన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. తమ జట్టుతో 18 ఏళ్లుగా హెడ్ కోచ్‌గా కొనసాగుతున్న స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను ఆ బాధ్యతల నుంచి తప్పించింది. ఫ్లెమింగ్ కోచింగ్‌లో సీఎస్కే ఐదుసార్లు ఐపీఎల్ టైటిల్ గెలుచుకుంది. ఎంఎస్ ధోనీతో అతనికి ఉన్న అవినాభావ సంబంధం జట్టు విజయాలకు మూలస్తంభంగా నిలిచింది. అయితే, గత మూడేళ్లుగా సీఎస్కే ప్లేఆఫ్స్‌కు కూడా అర్హత సాధించలేకపోయింది. ఈ నేపథ్యంలో ఫ్రాంచైజీ యాజమాన్యం ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఆధునిక టీ20 ఫార్మాట్‌లో అవసరమైన కొత్త వ్యూహాలు, ఆలోచనలు ఫ్లెమింగ్ వద్ద కొరవడ్డాయని, అందుకే జట్టు ప్రక్షాళనలో భాగంగా ఈ మార్పు చేపట్టినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. ఫ్లెమింగ్ నిష్క్రమణతో అతని స్థానాన్ని భర్తీ చేసే కొత్త కోచ్ ఎవరనే దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. పలువురు దిగ్గజాలు, యువ కోచ్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. కొత్త కోచ్ రేసులో ధోనీ, ద్రవిడ్, అశ్విన్, దినేశ్ కార్తీక్, హేమంగ్ బదానీ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.

## టీమిండియాతో తొలి మ్యాచ్‌కు

# ఇంగ్లండ్ జట్టు ప్రకటన

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మూడు వన్డేల సిరీస్‌కు రంగం సిద్ధమైంది. మంగళవారం బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరగనున్న తొలి మ్యాచ్ కోసం ఇంగ్లండ్ తమ తుది జట్టును ప్రకటించింది. ఈ మ్యాచ్‌లో యువ ఆల్‌రౌండర్ జాకబ్ బెథెల్‌ను ఓపెనర్‌గా బరిలోకి దించుతూ ఇంగ్లండ్ యాజమాన్యం ఆశ్చర్యకర నిర్ణయం తీసుకుంది. సీనియర్ బ్యాటర్ బెన్ డకెట్‌తో కలిసి అతను ఇన్నింగ్స్‌ను ప్రారంభించనున్నాడు. ఈ మ్యాచ్ ఇంగ్లండ్ వికెట్ కీపర్-బ్యాటర్ జోస్ బట్లర్‌కు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకం కానుంది. అతను తన కెరీర్‌లో 200వ వన్డే ఆడబోతున్నాడు. ఇంగ్లండ్ వైట్-బాల్ క్రికెట్‌లో కీలక ఆటగాడిగా ఉన్న బట్లర్, 2012 ఫిబ్రవరి 21న దుబాయ్‌లో పాకిస్థాన్‌పై తన వన్డే అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు ఆడిన 199 మ్యాచ్‌లలో 39.11 సగటుతో 5,515 పరుగులు సాధించాడు. ఇందులో 11 సెంచరీలు, 29 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఈ మైలురాయి మ్యాచ్‌లో అతను ఎలా రాణిస్తాడనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే 21 వన్డేలు ఆడిన యువ డైనమిక్ ప్లేయర్ బెథెల్‌ను ఓపెనర్‌గా ప్రమోట్ చేయడం వెనుక బలమైన కారణమే ఉంది. బెన్ డకెట్‌కు సరైన భాగస్వామిని కనుగొనాలనే ఇంగ్లండ్ ప్రయత్నాలు దీని ద్వారా స్పష్టమవుతున్నాయి. ఇటీవలి కాలంలో ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జాక్ క్రాలీ, రెహాన్ అహ్మద్ తర్వాత డకెట్‌కు ఐదో ఓపెనింగ్ భాగస్వామిగా బెథెల్ నిలవనున్నాడు. ఇది ఓపెనింగ్ స్థానంపై ఇంగ్లండ్ జట్టులో నెలకొన్న అస్థిరతను



సూచిస్తోంది. మరోవైపు, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్ వంటి బలమైన భారత బ్యాటింగ్‌ను కట్టడి చేసేందుకు కెప్టెన్ హ్యారీ బ్రూక్ నేతృత్వంలోని ఇంగ్లండ్ జట్టు పకడ్బందీ వ్యూహంతో బరిలోకి దిగుతోంది. విల్ జాక్స్, లియామ్ డాసన్, ఆదిల్ రషీద్ రూపంలో ముగ్గురు స్పిన్నర్లతో దాడి చేయాలని నిర్ణయించుకుంది. పేస్ బాధ్యతలను జోఫ్రా ఆర్చర్, జోష్ టంగ్ మోయనున్నారు. ఇటీవల టీ20 సిరీస్‌లో అదరగొట్టిన ఆర్చర్, గతేడాది నవంబర్ తర్వాత తొలిసారిగా వన్డే జట్టులోకి తిరిగి వచ్చాడు. దీంతో గస్ అట్కిన్‌సన్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి వన్డే జరగనుంది. ఇరు జట్లు జూలై 16న కార్డిఫ్‌లో రెండో వన్డే, జూలై 19న లార్డ్స్‌లో మూడో వన్డేలో తలపడనున్నాయి.

**తొలి వన్డేకు ఇంగ్లండ్ తుది జట్టు:**

జాకబ్ బెథెల్, బెన్ డకెట్, జో రూట్, హ్యారీ బ్రూక్ (కెప్టెన్), జోస్ బట్లర్ (వికెట్ కీపర్), శామ్ కరన్, విల్ జాక్స్, జోఫ్రా ఆర్చర్, లియామ్ డాసన్, జోష్ టంగ్, ఆదిల్ రషీద్.




# భారత మహిళదే లార్డ్స్



## భారత అమ్మాయిల చరిత్రాత్మక విజయం

లార్డ్స్ టెస్టులో భారత అమ్మాయిలు అద్భుతం చేశారు. నాలుగో రోజు తొలి సెషన్‌లోనే ఇంగ్లండ్ మిడిలార్డర్‌ను పడగొట్టి చరిత్రాత్మక విజయంతో సంబురాలు చేసుకున్నారు. టీ20 ప్రపంచకప్ వైఫల్యాన్ని మరిపించేలా.. 270 పరుగుల తేడాతో గెలుపొంది యావత్ భారతావనిని పులకింపజేశారు.

**తొలి ఇన్నింగ్స్‌లోనే ఇంగ్లండ్ పాలిట విలన్‌లా మారిన పేసర్ క్రాంతి గౌడ్ నిప్పులు చెరగడంతో ఆతిథ్య జట్టుకు ఓటమి తప్పలేదు. యస్తికా భాటియా(113) రికార్డు శతకం.. స్మృతి మంధాన(70)ల బ్యాటింగ్ మెరుపులతో కుదేలైన ఇంగ్లండ్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.**

ఇంగ్లండ్ గడ్డపై భారత పురుషుల జట్టుకు చెంపపెట్టులాంటి విజయం సాధించారు అమ్మాయిలు. పేలవమైన ఆటతో టీ20 సిరీస్‌లో వైట్‌వాష్‌కు గురైన శ్రేయాస్ అయ్యర్ సేనకు.. ఇంగ్లండ్‌ను ఇలా ఓడించాలి అని చాటిచెప్పింది హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం. లార్డ్స్‌లో జరిగిన ఏకైక టెస్టులో యువ పేసర్ క్రాంతి గౌడ్(2-54) విజృంభణతో ఆతిథ్య జట్టు బ్యాటర్లు తోకముడిచారు. బ్యాటుతో మెరిసిన స్మృతి మంధాన(70), యస్తికా భాటియా(113)లు చిరస్మరణీయ విజయంలో కీలకమయ్యారు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ తేలిపోయిన ఆతిథ్య జట్టు పొట్టి వరల్డ్‌కప్ ఓడిన చోటే.. ఏకైక టెస్టులోనూ చతికిలపడింది. టీమిండియా రెండో ఇన్నింగ్స్‌ను 341-7 వద్ద డిక్లేర్ చేశాక.. బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 6 పరుగులకే ఓపెనర్లను కోల్పోయింది. 457 పరుగుల భారీ ఛేదనలో క్రాంతి గౌడ్(2-54).. సయాలీ సత్ఘరే(2-24)ల ధాటికి ఆతిథ్య జట్టు చేతులెత్తేసింది. ఆఖరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడుతున్న టమ్మీ బ్యూమంట్(0), హీథర్ నైట్(13)లను ఔట్ చేసిన క్రాంతి విజయానికి పునాది వేసింది. మూడో రోజు పోరాడిన అమీ జోన్స్.. నాలుగోరోజు తొలి సెషన్‌లోనే ఔటవ్వగా.. టీమిండియా విజయం మరింత సులువైంది. ఓవర్‌నైట్ స్కోర్ 130-6తో నాలుగో రోజు ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ చూస్తుండగానే కుప్పకూలింది. తొలి సెషన్ మొదట్లోనే అమీ జోన్స్(54) వికెట్ తీసిన స్నేహ్ రాణా(4-42) ఆతిథ్య జట్టు ఓటమిని ఖాయం చేసింది. సోఫీ ఎకిల్‌స్టోన్(50)తో కలిసి ఎనిమిదో వికెట్‌కు 22 రన్స్ జోడించిన ఇసీ వాంగ్(1)ను దీప్తి శర్మ బౌల్డ్ చేసింది. తర్వాతి ఓవర్లోనే లారెన్ బెల్(0)ను దీప్తి బౌల్డ్ చేయగా.. క్రీజునంటుకున్న ఎకిల్‌స్టోన్‌ను రాణా ఔట్ చేసి తరాతరాలు చెప్పుకోదగగిన విజయంలో భాగమైంది. లార్డ్స్ టెస్టులో రెండో రోజు పట్టుబిగించిన భారత జట్టు పేసర్ క్రాంతి గౌడ్(5-37) సంచలన ప్రదర్శనతో ఇంగ్లండ్‌ను పడగొట్టింది. సొంతగడ్డపై దంచేయాలనుకున్న ఇంగ్లండ్ బ్యాటర్లను వణికించిన క్రాంతి.. మొదటి సెషన్‌లోనే కోలుకోలేని దెబ్బకొట్టింది. ఓపెనర్ మియా బౌచిర్(23)ను పెవిలియన్ చేర్చిన స్పీడ్‌స్టర్.. బౌండరీలతో చెలరేగుతున్న అలిసే క్యాప్సే(9)ను స్వింగ్‌తో వెనక్కి పంపింది. మరో ఎండ్‌లో సయాలీ సత్ఘరే(2-40), స్నేహ్ రాణా(2-41) రెచ్చిపోగా లంచ్ లోపే సగం మంది పెవిలియన్ చేరారు. అర్ధ శతకం బాదిన అమీ జోన్స్ (52) వెనుదిరిగినా.. పట్టువదలకుండా క్రీజునంటుకున్న కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్(44) పోరాడింది. కానీ, లంచ్ తర్వాత ఆమెను సైతం గౌడ్ వెనక్కి పంపింది. లారెన్ బెల్‌ను ఔట్ చేయడం ద్వారా టెస్టుల్లో మొదటిసారి ఐదు వికెట్లు తీసింది భారత స్పీడ్‌స్టర్. చివరి బ్యాటర్ లారెన్‌ను దీప్తి ఎల్బీ చేయడంతో 170 వద్ద ఇంగ్లండ్ ఇన్నింగ్స్ ముగిసింది. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియాకు 115 పరుగుల ఆధిక్యం లభించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ స్మృతి మంధాన (83), హర్మన్‌ప్రీత్ కౌర్(58)లు అర్ధ శతకాలతో పటిష్టమైన పునాది వేసినా లాభం లేకపోయింది. ఇంగ్లండ్ స్పిన్నర్ మ్యాడీ విల్లియర్స్(2-79) ధాటికి మిడిలార్డర్ వైఫల్యమైంది. ఓవైపు వికట్లు పడుతున్నా బాధ్యతగా ఆడిన దీప్తి శర్మ(57) టెయిలెండర్లతో కలిసి పోరాడి స్కోర్ 280 దాటించింది. కానీ, ఒకే ఓవర్లో దీప్తిని, క్రాంతి గౌడ్‌ను ఔట్ చేసిన సోఫీ ఎకిల్‌స్టోన్(3-68) భారత ఇన్నింగ్స్‌కు తెరదించింది.

## అందమైన ముందడుగు: సచిన్

లార్డ్స్‌లో చారిత్రక విజయం సాధించిన టీమిండియా మహిళల క్రికెట్ జట్టుపై భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రతిష్ఠాత్మక లార్డ్స్ మైదానంలో తొలిసారిగా జరిగిన మహిళల టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై హర్మన్‌ప్రీత్ కౌర్ సేన గెలవడం ఒక చారిత్రక ఘట్టమని అభివర్ణించాడు. మహిళల క్రికెట్ ప్రస్థానంలో ఇది మరో ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నాడు. ఈ మ్యాచ్ చివరి రోజున సచిన్ స్వయంగా మైదానంలో ఉండి విజయాన్ని వీక్షించాడు. ఆట ప్రారంభానికి ముందు సచిన్ భారత మహిళా క్రికెటర్లతో మాట్లాడాడు. ఇంగ్లండ్‌పై భారత్ 270 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించిన అనంతరం, సచిన్ సోషల్ మీడియా వేదికగా తన స్పందనను పంచుకున్నాడు. "ప్రతి క్రికెటర్‌కు లార్డ్స్‌లో ఆడాలనే కల ఉంటుంది. గత నాలుగు రోజులుగా, తొలిసారిగా ఇక్కడ మహిళల టెస్ట్ క్రికెట్ జరగడంతో కొత్త తరం క్రీడాకారిణులు ఆ కలను సాకారం చేసుకున్నారు" అని సచిన్ పేర్కొన్నాడు. ఈ అద్భుత విజయం సాధించిన భారత జట్టుకు అభినందనలు తెలిపిన సచిన్, కీలక క్రీడాకారిణుల ప్రదర్శనను ప్రత్యేకంగా ప్రస్తావించాడు. "వైస్ కెప్టెన్ స్మృతి మంధాన నిలకడ, యాస్తిక భాటియా అద్భుతమైన సెంచరీ, పేసర్ క్రాంతి గౌడ్ ఐదు వికెట్ల ప్రదర్శన ఈ సందర్భాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయి" అని కొనియాడాడు.

## లెస్బియన్ క్రికెట్ దంపతుల గోల!

ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ జట్టులో సీనియరైన అష్లే గార్డ్‌నర్ వివాదంలో ఇరుక్కుంది. మరో మహిళను పెళ్లి చేసుకున్న ఈ ఆల్‌రౌండర్ ఇప్పుడు మరొకరితో ప్రేమాయాణం సాగిస్తుందనే



వార్త వైరలవుతోంది. గార్డ్‌నర్‌పై ఈ ఆరోపణలు చేసింది ఆమె భార్య మోనికా రైట్ కావడం గమనార్హం. మోనికా తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకున్న ఈ అఫైర్ విషయం డెయిలీ మెయిల్ వార్త సంస్థలో ప్రచురితమైంది. గార్డ్‌నర్ అఫైర్‌పై భగ్గుమన్న మోనికా.. ఆస్ట్రేలియా క్రికెటర్ జార్జియా వోల్ ఫొటోను షేర్ చేస్తూ.. 'ఈవిడే మా కాపురాన్ని నాశనం చేసింది' అని వెల్లడించింది. అన్యోన్యంగా ఉండే తమ మధ్య దూరం పెరగడానికి కారణం భారత పర్యటనే అంటోంది మోనికా. భారత్ వేదికగా జరిగిన వన్డే ప్రపంచకప్ కోసం గార్డ్‌నర్‌తో పాటు ఆమె భార్య మోనికా కూడా వచ్చింది. అయితే.. టోర్నీ సమయంలోనే గార్డ్‌నర్ ప్రవర్తనలో తేడాను గమనించింది మోనిక. స్వదేశం వచ్చాక ఇదే విషయంపై తన భాగస్వామిని ఆమె ప్రశ్నించింది. అప్పుడు.. గార్డ్‌నర్ మన మధ్యలో ఏదో మార్పు వచ్చింది. ఇక కలిసి ఉండడం కుదరదు అని తేల్చి చెప్పింది. అక్కడితో వీరి పెళ్లి పెటాకులైంది. నిరుడు నవంబర్‌లోనే ఆసీస్ ఆల్‌రౌండర్ సిడ్నీలో తాము కలిసి ఉంటున్న ఇంటిని వీడింది. వెళ్తూ వెళ్తే తమ పెళ్లి ఉంగరాలను అక్కడే వదిలేసిందని డెయిలీ మెయిల్ కథనం పేర్కొంది. ఐదేళ్లు ప్రేమలో మునిగితేలిన గార్డ్‌నర్, మోనికలు 2025 ఏప్రిల్‌లో పెళ్లి చేసుకున్నారు. ఏడాది పూర్తికాగానే వీరి మధ్య మనస్పర్థలు.. పరాయి ఆకర్షణలు పెరగడంతో వీరి బంధం ముగిసింది.

## జూన్ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' నామినేషన్లలో గిల్

జూన్ నెలకు గానూ ఐసీసీ పురుషుల 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డుకు భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నామినేట్ అయ్యాడు. జూన్ నెలలో బ్యాట్‌తో అద్భుత ప్రదర్శన కనబర్చిన గిల్‌తో పాటు బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్, న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ నాథన్ స్మిత్ కూడా ఈ అవార్డు కోసం పోటీలో ఉన్నట్లు ఐసీసీ సోమవారం ప్రకటించింది. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన హోం సిరీస్‌లో గిల్ టెస్టు, వన్డే ఫార్మాట్లలో అద్భుతంగా రాణించాడు. న్యూ చండీగఢ్‌లో జరిగిన ఏకైక టెస్టులో 126 పరుగులు చేసి భారత ఇన్నింగ్స్ విజయానికి కీలకంగా నిలిచాడు. అనంతరం వన్డే సిరీస్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనే 238 పరుగులు సాధించాడు. తొలి వన్డేలో 66 బంతుల్లో 84 పరుగులు చేసిన గిల్, లక్నో వన్డేలో కాళ్ల నొప్పితో ఇబ్బంది పడుతూనే 110 బంతుల్లో 154 పరుగులు చేసి భారత్‌కు విజయం అందించాడు. ఆ మ్యాచ్‌తో పాటు సిరీస్‌లోనూ అత్యుత్తమ ఆటగాడిగా నిలిచి, భారత్ 3-0తో సిరీస్‌ను కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసద్దెక్ హుస్సేన్ ఆస్ట్రేలియాపై తన జట్టుకు చారిత్రక 2-1 వన్డే సిరీస్ విజయం అందించడంలో కీలక పాత్ర పోషించాడు.



ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక






## 'కొరియన్ కనకరాజు' టీజర్‌కు

# ప్రభాస్ శ్రీకారం

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న వైవిధ్యభరిత చిత్రం 'కొరియన్ కనకరాజు'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను చిత్రబృందం ప్రకటించింది. ఈ చిత్రంలోని 'కిమ్‌చి కారం' టీజర్‌ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించింది. సోమవారం సాయంత్రం 4.05 గంటలకు సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపింది. 'కొరియన్ కనకరాజు ప్రపంచాన్ని మీకు పరిచయం చేయడానికి రెబల్ స్టార్ ప్రభాస్ వస్తున్నారు' అంటూ చిత్రబృందం ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ టీజర్ ద్వారా సినిమాలో వరుణ్ తేజ్ పాత్ర, ఆయన హావభావాలు, నటన శైలి ఎలా ఉండబోతుందో ప్రేక్షకులకు పరిచయం చేయనున్నట్లు సమాచారం. 'భారత--కొరియా వినోదం' అనే భావనతో రూపొందుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రానికి గాంధీ మేర్లపాక దర్శకత్వం వహిస్తున్నారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్, యూవీ క్రియేషన్స్, టీ-సిరీస్ సౌత్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నిర్మాతలుగా రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి వ్యవహరిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మాణ భాగస్వామిగా ఉండటంతో ప్రభాస్ ఈ టీజర్‌ను విడుదల చేయడానికి ముందుకు వచ్చినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సంగీత దర్శకుడు ఎస్.ఎస్. తమన్ స్వరాలు సమకూరుస్తున్న ఈ యాక్షన్ వినోదాత్మక చిత్రాన్ని ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. టీజర్ విడుదలతో సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు.

# కలెక్టర్ కాదు.. అమ్మలా మారారు

### విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్

### ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలి..

### అధికారులకు కలెక్టర్ కె. హరిత ఆదేశం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత తన నిరాడంబరతతో మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. సోమవారం జిల్లాలోని గిరిజన గురుకుల బాలికల సంక్షేమ పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ కార్యక్రమం ముగిసిన అనంతరం ఆమె తన అధికారిక హోదాను, ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి, సామాన్య వ్యక్తిలా నేరుగా గిరిజన విద్యార్థినుల మధ్యకు వెళ్లారు. ఎటువంటి భేషజాలు లేకుండా నేలపైనే విద్యార్థులతో కలిసి కూర్చుని మధ్యాహ్న భోజనం చేశారు. ఒక జిల్లా అత్యున్నత అధికారిణి స్వయంగా తమ పక్కనే కూర్చుని, తల్లిలా ఆప్యాయంగా మాట్లాడుతుంటే గిరిజన బిడ్డల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. భోజనం చేస్తున్న సమయంలో కలెక్టర్ విద్యార్థినులను ఎంతో ఆత్మీయంగా పలకరిస్తూ ముచ్చటించారు. పాఠశాలలో ప్రతిరోజూ భోజనం రుచికరంగా ఉంటుందా, కూరలు సరిగ్గా వండుతున్నారా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు రోజూ పౌష్టికాహారాన్ని అందించాలని స్పష్టం చేశారు. అన్నం, కూరల తయారీలో ఎట్టి పరిస్థితుల్లోనూ నాణ్యత లోపించకూడదని, కేవలం తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులను మాత్రమే వినియోగించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పాఠశాలలో ప్రతి ఒక్కరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యాబోధన సాగాలని ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం చేశారు.



అదేవిధంగా పాఠశాల మరియు హాస్టల్ పరిసరాలను ఎల్లప్పుడూ అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని, మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె. హరిత గారు ఆదేశించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా వ్యవహరించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గురుకుల సిబ్బంది, స్థానిక అధికారులు పాల్గొన్నారు.



# ఒడిదొడుకులు దాటి మళ్లీ వెలుగులోకి అమీషా పటేల్

బాలీవుడ్ ప్రముఖ నటి అమీషా పటేల్ సినీ ప్రయాణం విజయాలు, ఒడిదొడుకులతో సాగింది. 2000లో హృతిక్ రోషన్ సరసన నటించిన 'కహో నా ప్యార్ హై' చిత్రంతో వెండితెరకు పరిచయమైన ఆమె, తొలి సినిమాతోనే ఘన విజయాన్ని అందుకుని రాత్రికి రాత్రే స్టార్ కథానాయికగా గుర్తింపు పొందారు. రాకేష్ రోషన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత తెలుగు సినీ పరిశ్రమలో పవన్ కళ్యాణ్ సరసన 'బద్రి' చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు. అనంతరం సన్నీ డియోల్‌తో కలిసి నటించిన 'గదర్: ఏక్ ప్రేమ్ కథ' చిత్రంలోని 'సకీనా' పాత్ర ఆమెకు దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపును తీసుకొచ్చింది. ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలో అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. తదుపరి 'హమ్‌రాజ్', 'భూల్ భులయ్యా' వంటి విజయవంతమైన చిత్రాల్లో నటించినప్పటికీ, ఆ తర్వాత ఆమె సినీ జీవితంలో కొన్ని ఒడిదొడుకులు ఎదురయ్యాయి. కొన్ని చిత్రాలు ఆశించిన విజయాన్ని అందుకోకపోవడం, వ్యక్తిగత కారణాలతో కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నారు. దాదాపు రెండు దశాబ్దాల తర్వాత 2023లో విడుదలైన 'గదర్ 2'తో అమీషా పటేల్ ఘనంగా తిరిగి ప్రేక్షకుల ముందుకు వచ్చారు. సన్నీ డియోల్, అమీషా పటేల్ జంట మరోసారి ప్రేక్షకులను అలరించడంతో ఈ చిత్రం రూ.500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి ఘన విజయాన్ని అందుకుంది. 'సకీనా' పాత్రకు ఇప్పటికీ ప్రేక్షకుల్లో ఉన్న ఆదరణను ఈ చిత్రం మరోసారి నిరూపించింది. ఈ విజయంతో 'గదర్ 3' నిర్మాణానికి కూడా సన్నాహాలు జరుగుతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. 'కహో నా ప్యార్ హై'తో ప్రారంభమైన అమీషా పటేల్ సినీ ప్రయాణం ఎన్నో సవాళ్లను అధిగమించి నేటికీ విజయవంతంగా కొనసాగుతోంది. 1975 జూన్ 9న ముంబైలో జన్మించిన ఆమె ప్రముఖ న్యాయవాది, రాజకీయ నాయకుడు రజనీ పటేల్ మనవరాలు. సినిమా నేపథ్యం లేకపోయినా తన ప్రతిభతో సినీ రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా నటించిన 'నరసింహుడు' చిత్రంలో కథానాయికగా నటించిన అమీషా పటేల్, మహేష్ బాబు నటించిన 'నాని' చిత్రంలో ఒక ప్రత్యేక గీతంలో కూడా సందడి చేశారు. ప్రస్తుతం ఎంపిక చేసిన చిత్రాల్లో మాత్రమే నటిస్తూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

## ఒక్క రాత్రిలో తొమ్మిది సినిమాలు

# కోల్పోయా: విద్యా బాలన్

ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా గుర్తింపు పొందిన విద్యా బాలన్ తన సినీ జీవిత ప్రారంభంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నట్లు వెల్లడించారు. ఒక సినిమా ఆగిపోవడంతో తనపై "ఐరన్ లెగ్" అనే ముద్ర వేసి, ఒక్క రాత్రిలోనే తొమ్మిది చిత్రాల నుంచి తొలగించారని ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడిన విద్యా బాలన్, తన సినీ ప్రయాణం ప్రారంభ రోజులను గుర్తు చేసుకున్నారు. మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ సరసన 'చక్రం' చిత్రంలో నటించే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు. అయితే చిత్రీకరణ ప్రారంభమైన కొద్ది రోజులకే అనివార్య కారణాలతో ఆ సినిమా నిలిచిపోయిందని చెప్పారు. ఆ సినిమా ఆగిపోవడానికి తానే కారణమని కొందరు ప్రచారం చేశారని, దీంతో తనపై "ఐరన్ లెగ్" అనే ముద్ర వేశారని విద్యా బాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ ప్రచారం కారణంగా ఒక్క రాత్రిలోనే తొమ్మిది సినిమాల నుంచి తనను తొలగించారని తెలిపారు. ఆ సమయంలో తాను తీవ్ర మానసిక వేదన అనుభవించినట్లు చెప్పారు. అయితే వాస్తవానికి సినిమా ఆగిపోవడానికి తనకు ఎలాంటి సంబంధం లేదని, దర్శకుడు, మోహన్‌లాల్ మధ్య ఏర్పడిన అభిప్రాయ భేదాల వల్లే ఆ ప్రాజెక్టు నిలిచిపోయిందని విద్యా బాలన్ స్పష్టం చేశారు. కానీ ఆ సంఘటన తన సినీ జీవితంపై తీవ్ర ప్రభావం చూపిందని పేర్కొన్నారు.



అనేక ఇబ్బందులు, వివాదాలను ఎదుర్కొన్నప్పటికీ తన ప్రతిభపై నమ్మకం కోల్పోలేదని, కష్టపడి అవకాశాలను అందిపుచ్చుకుని నటిగా తనను తాను నిరూపించుకున్నానని విద్యా బాలన్ తెలిపారు. అనంతరం వరుస విజయాలతో భారతీయ సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా ఎదిగి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన చిత్రాల్లో మాత్రమే నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**